# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | బుధవారం - 3 - జూన్ - 2026 | సంపుటి : 4 | సంచిక : 01 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


# తెలంగాణ రైజింగ్‌కు శ్రీకారం




అమరవీరుల త్యాగాలకు వందనం

సంక్షేమంతో సమగ్రాభివృద్ధి.. త్రివేల్యన్ ఆర్థిక వ్యవస్థ లక్ష్యం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, జూన్ 2 (తెలంగాణ ముచ్చట్లు):**

స్వరాష్ట్ర అస్తిత్వం కోసం దశాబ్దాల పాటు సాగిన ఉద్యమ పోరాటాలు, వేలాది మంది అమరవీరుల త్యాగాల ఫలితమే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వేడుకల్లో పాల్గొన్న ఆయన, భద్రతా దళాల కవాతును పరిశీలించి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం రాష్ట్ర ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు తెలంగాణ భవిష్యత్ అభివృద్ధి దిశగా ప్రజా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు.

తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరులందరికీ ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఘన నివాళులు అర్పించారు. వారి త్యాగాల వల్లే రాష్ట్రం సాధ్యమైందని, ఆ స్ఫూర్తితోనే ప్రభుత్వం పని చేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ తెలంగాణను దేశానికే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. డిసెంబర్ 7, 2023న బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి తెలంగాణ అభివృద్ధి, పేదరిక నిర్మూలన, సామాజిక న్యాయం అనే మూడు ప్రధాన లక్ష్యాలతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ప్రత్యేక తెలంగాణ స్వప్నాన్ని సాకారం చేసిన మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్, యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీలకు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ఏర్పాటుకు వారు చేసిన కృషిని రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ మరువరని అన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని వివరించారు. రైతుల సంక్షేమానికి

మిగతా 2లో..

## ఎరువుల విక్రయాల్లో అక్రమాలకు చెక్

- ఖరీఫ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు
- లింకింగ్ విక్రయాలకు నో.. అధిక ధరలపై కఠిన చర్యలు

**హైదరాబాద్, జూన్ 2 (తెలంగాణ ముచ్చట్లు):**

ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందుబాటులో ఉండేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని వ్యవసాయ సంచాలకులు డాక్టర్ బి. గోపీ అధికారులను ఆదేశించారు. వ్యవసాయ కమిషనరేట్ కార్యాలయంలో ఎరువుల డీలర్ల సంఘం ప్రతినిధులు, హోల్‌సేల్ డీలర్లు, ఎరువుల తయారీ సంస్థల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన ఎరువుల నిల్వలను నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులకు ఎలాంటి కొరత తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాల వారీగా నిల్వల పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సరఫరా వ్యవస్థను బలోపేతం

మిగతా 2లో..




## తెలంగాణలో జనసేన పోటీ ఖాయం: పవన్ కల్యాణ్

- తెలంగాణపై ప్రేమే కారణం
- విమర్శలకు ఘాటు సమాధానం.. ఎన్నికల్లో జనసేన బరిలోకి

**హైదరాబాద్, జూన్ 2 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామానికి తెరలేపుతూ జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సంచలన ప్రకటన చేశారు. ఇకపై తెలంగాణలో జరిగే ఎన్నికల్లో జనసేన పార్టీ తప్పకుండా పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన, తనపై వస్తున్న విమర్శలు, బెదిరింపులు, తెలంగాణపై చేస్తున్న దుష్ప్రచారానికి ఘాటుగా బదులిచ్చారు. తెలంగాణ తనకు ఎంతో ఆత్మీయమైన నేల అని, ఈ ప్రాంతంపై తనకు ఎనలేని ప్రేమ ఉందని పేర్కొన్నారు. కొందరు రాజకీయ నాయకులు,

మిగతా 2లో..




## కాంగ్రెస్ పాలనపై కేటీఆర్ విమర్శలు

- తెలంగాణ భవన్‌లో అవతరణ వేడుకలు
- ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు
- తెలంగాణ కోసం పోరాటం కొనసాగిస్తాం

**హైదరాబాద్, జూన్ 2 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో నిర్వహించిన వేడుకల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై తీవ్ర విమర్శలు చేస్తూ రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై తన అభిప్రాయాలను వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ అబద్ధాలు, తప్పుడు హామీలు, విష ప్రచారాలతో అధికారంలోకి వచ్చిందని కేటీఆర్ ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. తెలంగాణ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రాష్ట్రాన్ని

మిగతా 2లో..



## పశువైద్యశాలలకు నిధుల మంజూరు

- హుస్నాబాద్‌కు కొత్త భవనం
- ములకనూరుకు ఆధునిక సదుపాయాలు
- రైతులకు మెరుగైన సేవలు.. మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్, జూన్ 2 (తెలంగాణ ముచ్చట్లు):** హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం మరో శుభవార్త అందించింది. పశుపోషక రైతులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో హుస్నాబాద్ ఏరియా పశువైద్యశాలకు, హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం ములకనూరు పశువైద్యశాలకు నూతన భవనాల నిర్మాణం కోసం మొత్తం రూ. 1.40 కోట్ల నిధులను మంజూరు చేస్తూ పరిపాలనా అనుమతులు జారీ చేసింది. రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ ఆధ్వర్యంలో

మిగతా 2లో..



## హన్మకొండలో ఘనంగా తెలంగాణ అవతరణ వేడుకలు

- జాతీయ పతాకం ఆవిష్కరణ
- అమరవీరులకు ఘన నివాళి.. అభివృద్ధి లక్ష్యాలపై మంత్రి

**హన్మకొండ, జూన్ 2 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ రాష్ట్ర 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు హన్మకొండ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. తెలంగాణ సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరవీరులను ఈ సందర్భంగా స్మరించుకుంటూ వారికి ఘన నివాళులు అర్పించారు. తెలంగాణ

మిగతా 2లో..



## భూపోరాటానికి కవిత పిలుపు

- జూలై 2న భారీ ఉద్యమం
- జయశంకర్ విగ్రహం ఏర్పాటు చేయాలి
- ఉద్యమకారుల హక్కుల కోసం పోరాటం




**హైదరాబాద్, జూన్ 2 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరవీరులను స్మరించుకుంటూ, తెలంగాణ ఉద్యమం మరో స్వాతంత్ర్య పోరాటాన్ని తలపించే మహత్తర ఉద్యమమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన కవిత తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పన్నెండు సంవత్సరాలు పూర్తయినా ఉద్యమ ఆశయాల సాధన ఇంకా పూర్తి కాలేదని అన్నారు. వేలాది

మిగతా 2లో..

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# తెలంగాణ రైజింగ్‌కు శ్రీకారం

(మొదటి పేజీ తరువాయి)

అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సవాళ్లతో కూడుకున్నప్పటికీ రైతులకు అండగా నిలిచేందుకు రూ.2 లక్షల వరకు పంట రుణమాఫీ అమలు చేశామని చెప్పారు. గత రెండున్నరేళ్లలో వ్యవసాయం, రైతు సంక్షేమం కోసం లక్షా యాభై ఆరు వేల కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేసినట్లు వెల్లడించారు. రైతులు పండించిన ధాన్యం, మొక్కజొన్న, ఇతర పంటలకు కనీస మద్దతు ధర అందిస్తూ చివరి గింజ వరకు కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. రైతులు దళారుల బారిన పడకుండా ప్రభుత్వం నేరుగా కొనుగోలు ప్రక్రియ నిర్వహిస్తోందన్నారు. తెలంగాణ నీటి సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కృష్ణా, గోదావరి జలాల్లో రాష్ట్ర హక్కులను సాధించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పునరుద్ధరించి ఉత్తర తెలంగాణకు సాగునీరు అందించే దిశగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. నీటి వనరుల వినియోగంలో రాజీ పడకుండా తెలంగాణ ప్రయోజనాలను కాపాడుతామని స్పష్టం చేశారు. మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం వల్ల వారు దాదాపు పది వేల కోట్ల రూపాయలు ఆదా చేసుకున్నారని తెలిపారు. ఐదు వందల రూపాయలకే వంట గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని, రెండు వందల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని వివరించారు. మహిళా సంఘాలను ఆర్థిక శక్తి కేంద్రాలుగా తీర్చిదిద్దుతూ లక్షలాది మంది మహిళలను స్వయం ఉపాధి దిశగా నడిపిస్తున్నామని చెప్పారు. యువతకు ఉద్యోగాల కల్పనలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పారదర్శక విధానాలతో అరవై ఏడు వేల ఏడు వందల అరవై మూడు ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని వెల్లడించారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో సంస్కరణలు చేపట్టి రికార్డు స్థాయిలో నియామకాలు పూర్తి చేశామని చెప్పారు. రాబోయే రోజుల్లో కూడా నోటిఫికేషన్ల ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. విద్య ద్వారానే పేదరిక నిర్మూలన సాధ్యమని విశ్వసిస్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం విస్తృత చర్యలు చేపట్టామని, వేలాది పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులను ప్రారంభించినట్లు చెప్పారు. విద్యార్థులకు అల్పాహార పథకాన్ని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు విస్తరించనున్నట్లు ప్రకటించారు. నాణ్యమైన విద్య, ఆధునిక మౌలిక సదుపాయాలతో విద్యార్థులను ప్రపంచ స్థాయి పోటీలకు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. పేదలకు గౌరవప్రదమైన జీవనం కల్పించడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యమని ముఖ్యమంత్రి చెప్పారు. మొదటి ఏడాదిలోనే నాలుగున్నర లక్షల ఇళ్లను మంజూరు చేశామని, లక్ష ఇళ్ల నిర్మాణం ఇప్పటికే పూర్తైందని వెల్లడించారు. సెప్టెంబర్ 17 నాటికి మరో రెండు లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి గృహప్రవేశాలు నిర్వహిస్తామని తెలిపారు. పేదలకు సొంత ఇల్లు అంటే ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. ఆహార భద్రత కోసం రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది కొత్త రేషన్ కార్డులు జారీ చేశామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. మూడు కోట్లకు పైగా ప్రజలకు నాణ్యమైన సన్నబియ్యం అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. గిగ్ కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక చట్టం తీసుకువచ్చిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగుల కోసం కోటి రూపాయల బీమా పథకం, నగదు రహిత వైద్య సేవల కోసం ప్రత్యేక ఆరోగ్య సంరక్షణ ట్రస్ట్ ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి సేవల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో ఆధునిక మౌలిక సదుపాయాల అభివృద్ధి, మెట్రో విస్తరణ, పర్యావరణ పరిరక్షణ, మూసీ ప్రక్షాళన వంటి కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. ఆక్రమణలకు గురైన చెరువులు, ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటూ ప్రజల ఆస్తులను కాపాడుతున్నామని చెప్పారు. భారత్ ఫ్యూచర్ సిటీ, ఫోర్త్ సిటీ, మెట్రో విస్తరణ, బుల్లెట్ రైలు అనుసంధానం వంటి మహత్తర ప్రణాళికలతో తెలంగాణను ప్రపంచానికి గేట్‌వేగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి వెల్లడించారు. తెలంగాణ రైజింగ్-2047 దార్శనిక పత్రం ద్వారా 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని సంకల్పించినట్లు చెప్పారు. ఈ లక్ష్య సాధనలో ప్రజల సహకారం, ఆశీర్వాదం అవసరమని కోరుతూ జైహింద్, జై తెలంగాణ అంటూ తన ప్రసంగాన్ని ముగించారు.

# ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**వేంసూరు, జూన్ 2 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వసతి గృహ సంక్షేమ అధికారి డా. తిమ్మిడి నాగరాజు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ అమరవీరులకు ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎందరో అమరవీరులు చేసిన త్యాగాలు, ప్రజలు సాగించిన ఉద్యమాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు, కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు విద్యాభ్యాసంతో పాటు క్రమశిక్షణ,




నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను పెంపొందించుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సిబ్బంది పాల్గొన్నారు.

# పీచరలో ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు

**వేలేరు, జూన్ 2 (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండలం పీచర గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మరిజే అనిత నరసింహారావు జాతీయ జెండాను ఆవిష్కరించి తెలంగాణ అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. అనంతరం గ్రామ పంచాయతీ పారిశుధ్య సిబ్బందికి శానిటేషన్ సామగ్రి, యూనిఫాం డ్రెస్సులు, బ్లౌజ్ పీసులు, చెప్పులు, మాస్కులు, సబ్బులు, నూనె, షూస్ తదితర అవసరమైన వస్తువులను పంపిణీ చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ పరిశుభ్రతకు నిరంతరం సేవలందిస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలు అభినందనీయమని, వారి సంక్షేమానికి గ్రామ పంచాయతీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. త్యాగాల పునాదిపై నిర్మితమైన తెలంగాణ ప్రతి పౌరుడి ఆత్మగౌరవానికి ప్రతీక అమరవీరుల ఆశయాలే మన బాట... బంగారు తెలంగాణే మన లక్ష్యం. తెలంగాణ సాధన కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను స్మ




రిస్తూ, వారి ఆశయాలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమం, సమానత్వం దిశగా ముందుకు సాగాలని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి తోట అనిల్, గ్రామ ఉప సర్పంచ్ గుడికందుల ప్రశాంత్, వార్డ్ సభ్యులు కొలిపాక వెంకటేష్, గుడికందుల రాకేష్, ఒద్దుల శ్రీకాంత్, జేరుపోతుల జగన్, ఉప్పుల శ్రీధర్ రెడ్డి, గుండెల్లి సౌజన్య, ఎడ్ల అశ్విని, రామంచ ప్రశాంత్, పురామణి కవిత, జల్తరీ సుకన్య, గ్రామ పాలన సంబంధిత అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు, గ్రామస్థులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనపై కేటీఆర్ విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)

అభివృద్ధి దిశ నుంచి వెనక్కి నెట్టిందని అన్నారు. రాష్ట్రంలో రైతులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, వివిధ వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. రైతులకు సరైన మద్దతు లేకపోవడం, పంటల కొనుగోళ్లలో జాప్యం, ఎరువుల సమస్యలు వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టాయని ఆరోపించారు. రైతుబంధు వంటి పథకాల అమలులో కూడా ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఉద్యోగాల భర్తీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని కేటీఆర్ అన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా చేతులెత్తేసిందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణలో తెలంగాణ వెనుకబడుతోందని కేటీఆర్ పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం పెట్టుబడిదారులకు ఆకర్షణీయ గమ్యస్థానంగా ఉండేదని, ప్రస్తుతం పరిస్థితులు మారిపోయాయని విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో కూడా ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి క్షీణించిందని, వివిధ వర్గాల ప్రజలు ప్రభుత్వంపై అసంతృప్తితో ఉన్నారని కేటీఆర్ అన్నారు. తెలంగాణ అభివృద్ధి, రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. అధికారం కోసం కాకుండా తెలంగాణ భవిష్యత్తు కోసం తమ పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు. తెలంగాణ సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరవీరుల ఆశయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కేటీఆర్ అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం మరో ప్రజా ఉద్యమానికి సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణలో జనసేన పోటీ ఖాయం: పవన్ కల్యాణ్

(మొదటి పేజీ తరువాయి)

విశ్లేషకులు ఉద్దేశపూర్వకంగా తనపై ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

తాను ఎన్నడూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించలేదని పవన్ కల్యాణ్ మరోసారి స్పష్టం చేశారు. రాష్ట్ర విభజన జరిగిన తీరును మాత్రమే ప్రశ్నించానని, ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా పార్లమెంట్‌లో వ్యవహరించిన విధానాన్ని తప్పుపట్టానని చెప్పారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను ఎప్పుడూ గౌరవించానని, సామాజిక న్యాయంతో కూడిన తెలంగాణ తన కల అని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన యువత, అమరవీరుల త్యాగాలకు తనకు అపార గౌరవం ఉందన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా కొందరు తనను తెలంగాణ వ్యతిరేకిగా చిత్రీకరించడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తనపై వస్తున్న భూకబ్జా ఆరోపణలపైనా పవన్ తీవ్రంగా స్పందించారు. హైదరాబాద్‌లో తాను చెరువు భూమిని ఆక్రమించానంటూ చేస్తున్న ప్రచారాన్ని ఖండిస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఆ భూమిని పరిశీలించాలని సవాల్ విసిరారు. తాను భూమి ఆక్రమించినట్లు నిరూపితమైతే ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకోవచ్చని, తనపై చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చని ప్రకటించారు. అధికార పదవుల కోసం రాజకీయాలు చేయడం తన లక్ష్యం కాదని, వ్యవస్థలో మార్పు తీసుకురావడమే తన ధ్యేయమని స్పష్టం చేశారు. తెలంగాణలో ముఖ్యమంత్రి అవ్వాలనే ఆశ తనకు లేదని, ప్రజల సమస్యల పరిష్కారమే తన రాజకీయాల ఉద్దేశమని తెలిపారు.

తెలంగాణలో జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని కార్యకర్తలు, నాయకులు ఎప్పటి నుంచో కోరుతున్నారని పవన్ తెలిపారు. అందుకే ఇకపై రాష్ట్ర వ్యాప్తంగా స్వయంగా పర్యటించి పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్తానని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో జనసేన తప్పకుండా పోటీ చేస్తుందని, ఎవరి బెదిరింపులకు భయపడబోదని హెచ్చరించారు. తెలంగాణలో ప్రజా సమస్యలపై మాట్లాడతామని, అన్యాయాలను ప్రశ్నిస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ భారతదేశంలో అంతర్భాగమని, ఎవరూ తమ ఇష్టానుసారం ఎవరికైనా ప్రవేశం నిరాకరించలేరని పేర్కొన్నారు.

ప్రజా గాయకుడు గద్దర్‌తో తనకు ఉన్న అనుబంధాన్ని కూడా పవన్ భావోద్వేగంగా గుర్తు చేసుకున్నారు. గద్దర్ జీవించి ఉన్న సమయంలో ఆయనకు అవసరమైన సహాయం చేశానని, ఆయన తనను ఎంతో ఆప్యాయంగా చూసేవారని చెప్పారు. గద్దర్ బతికున్నప్పుడు పట్టించుకోని వారు ఇప్పుడు ఆయన పేరును రాజకీయాల కోసం ఉపయోగించుకోవడం విచారకరమన్నారు. తనకు వామపక్షాలు, కుడిపక్షాలు అనే భావజాలాల కంటే మానవతా విలువలే ముఖ్యమని తెలిపారు. గద్దర్ చివరి రోజుల్లో కూడా యువత భవిష్యత్తుపై ఆలోచించారని, ఆ సందేశాన్ని సమాజానికి చేరవేయడం మన బాధ్యత అని అన్నారు.

ఆంధ్రా, తెలంగాణ ప్రజల మధ్య కొందరు కావాలనే విద్వేషాలు రెచ్చగొడుతున్నారని పవన్ కల్యాణ్ ఆందోళన వ్యక్తం చేశారు. నాయకుల తప్పులను ప్రజలపై మోపడం సరికాదని, ప్రాంతీయ ద్వేషాలు దేశ సమగ్రతకు హానికరమని హెచ్చరించారు. తెలంగాణలో పరిశ్రమలు రాకపోయినా, ఉపాధి సమస్యలు ఉన్నా వాటికి ఆంధ్ర ప్రజలను బాధ్యులను చేయడం సరైన విధానం కాదన్నారు. ప్రజలు వేరు, పాలకులు వేరు అనే విషయాన్ని గుర్తించాలని సూచించారు. దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాల ప్రజలు పరస్పర గౌరవంతో జీవించాలని, భారతీయులుగా ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తెలంగాణపై తన ప్రేమను ఎవరూ ప్రశ్నించలేరని, రాష్ట్ర ప్రజలతో కలిసి పనిచేయడం కొనసాగిస్తానని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

# ఎరువుల విక్రయాల్లో అక్రమాలకు చెక్

(మొదటి పేజీ తరువాయి)

చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రైతులు సాగు పనులు ప్రారంభించే సమయంలో ఎరువుల కొరత కారణంగా ఇబ్బందులు ఎదుర్కోకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని పేర్కొన్నారు. ఎరువుల విక్రయాల సమయంలో పురుగు మందులు, సూక్ష్మపోషకాలు లేదా ఇతర వ్యవసాయ ఉత్పత్తులను బలవంతంగా కొనుగోలు చేయించే లింకింగ్ విధానాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని స్పష్టం చేశారు. రైతులు కోరిన ఎరువులను మాత్రమే విక్రయించాలని, అదనపు ఉత్పత్తులను కొనుగోలు చేయాలని ఒత్తిడి చేయరాదని హెచ్చరించారు. ఈ విషయంలో ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా వెంటనే విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. గరిష్ట చిల్లర ధర కంటే అధిక ధరలకు ఎరువులు విక్రయించినట్లు గుర్తిస్తే సంబంధిత డీలర్లు, విక్రేతలపై ఎరువుల నియంత్రణ ఉత్తర్వులు-1985 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ సంచాలకులు హెచ్చరించారు. రైతుల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, జిల్లా స్థాయిలో తనిఖీలు మరింత ముమ్మరం చేయాలని అధికారులకు సూచించారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఎరువుల సరఫరా, నిల్వలు, పంపిణీ వ్యవస్థలో ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆయన స్పష్టం చేశారు. రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందుబాటులో ఉండేలా వ్యవసాయ శాఖ, సహకార శాఖ, ఎరువుల సంస్థలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో సహకార శాఖ ప్రత్యేక సంచాలకులు రాహుల్ రాజ్, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, ఎరువుల తయారీ సంస్థల ప్రతినిధులు, డీలర్ల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగాలని సమావేశంలో నిర్ణయించారు.

# పశువైద్యశాలలకు నిధుల మంజూరు

(మొదటి పేజీ తరువాయి)

ఈ నిధులను విడుదల చేశారు. ప్రభుత్వం జి.ఓ.ఆర్.టి. నెం.36, తేదీ 0206 2026 ద్వారా అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఆధునిక సదుపాయాలతో కూడిన నూతన భవనాల నిర్మాణం పూర్తయితే పశువులకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ హుస్నాబాద్ ప్రాంతంలో పశుసంపద అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పశుపోషణ రైతుల జీవనాధారంగా మారిన నేపథ్యంలో వారికి అవసరమైన వైద్య సదుపాయాలను మెరుగుపరచడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. నూతన భవనాల ద్వారా పశువైద్య సేవలు మరింత సమర్థవంతంగా అందించడంతో పాటు అత్యవసర చికిత్సలు, వ్యాధి నిర్ధారణ, టీకాల కార్యక్రమాలు, పశు సంరక్షణ సేవలు మెరుగుపడతాయని అధికారులు తెలిపారు. ఆధునిక వసతులతో నిర్మించనున్న ఈ భవనాలు రైతులకు ఎంతో ఉపయోగపడనున్నాయని పేర్కొన్నారు. హుస్నాబాద్ అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో ప్రజాపాలన ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ నిధుల మంజూరుకు సహకరించిన ముఖ్యమంత్రి కి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పశుపోషక రైతుల సంక్షేమం, పశుసంపద అభివృద్ధి కోసం ప్రభుత్వం మరిన్ని చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

# .. తెలంగాణ అవతరణ వేడుకలు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రం ఎన్నో త్యాగాలు, ఉద్యమాల ఫలితంగా ఏర్పడిందని పేర్కొంటూ అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడం ప్రభుత్వ బాధ్యత అని మంత్రి అన్నారు. రాష్ట్ర నిర్మాణంలో ఉద్యమకారుల పాత్రను కొనియాడారు. అనంతరం జరిగిన సభలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రసంగిస్తూ జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రజా ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తోందని, రైతులు, మహిళలు, యువత, పేదల అభ్యున్నతికి అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి, విద్య, వైద్యం, ఉపాధి రంగాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వరంగల్ ప్రాంతాన్ని రాష్ట్రంలోనే అభివృద్ధి చెందిన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నట్లు మంత్రి వెల్లడించారు. పట్టణాభివృద్ధి, పారిశ్రామిక ప్రగతి, రవాణా సౌకర్యాల విస్తరణ, విద్యాసంస్థల బలోపేతం వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించిందని చెప్పారు. ప్రజల భాగస్వామ్యంతో మరింత వేగంగా అభివృద్ధి సాధించగలమని ఆశాభావం వ్యక్తం చేశారు. వేడుకల్లో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అలాగే విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, నగర ప్రముఖులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విజయవంతం చేశారు. దేశభక్తి గీతాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, పోలీసు బృందాల కవాతు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తెలంగాణ రాష్ట్ర ప్రగతి, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ప్రతిజ్ఞ చేస్తూ వేడుకలు ఘనంగా ముగిశాయి.

# భూపోరాటానికి కవిత పిలుపు

(మొదటి పేజీ తరువాయి)

మంది యువత, విద్యార్థులు, ఉద్యోగులు తమ భవిష్యత్తును పణంగా పెట్టి తెలంగాణ కోసం పోరాడారని, వారి త్యాగాలను తరతరాలకు గుర్తు చేసే బాధ్యత సమాజంపై ఉందన్నారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం కోసం జరిగిన ఉద్యమాన్ని ప్రతి కుటుంబం గుర్తుంచుకోవాలని, జూన్ 2ను కేవలం సెలవు రోజుగా కాకుండా ఆత్మగౌరవ దినోత్సవంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమానికి సైద్ధాంతిక పునాదులు వేసిన ప్రొఫెసర్ జయశంకర్ సేవలను ఈ సందర్భంగా ప్రత్యేకంగా ప్రస్తావించిన కవిత, ఆయన విగ్రహం ఇప్పటికీ రాష్ట్ర రాజధానిలో లేకపోవడం బాధాకరమని అన్నారు. తెలంగాణ ఆలోచనకు రూపకల్పన చేసిన మహనీయుడైన జయశంకర్‌కు తగిన గౌరవం ఇవ్వాల్సిన సమయం వచ్చిందన్నారు. ఆగస్టు 6న ఆయన జయంతి నాటికి ట్యాంక్‌బండ్‌పై విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అవసరమైతే విగ్రహ నిర్మాణ వ్యయంతో పాటు నిర్వహణ బాధ్యతను కూడా తెలంగాణ జాగృతి భరిస్తుందని స్పష్టం చేశారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలుపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడం దురదృష్టకరమని కవిత విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారికి గౌరవం, గుర్తింపు, సంక్షేమం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా ఈ అంశాలపై ముఖ్యమంత్రి ప్రకటన చేస్తారని ఆశించామని, కానీ అలాంటి ప్రకటన రాకపోవడం నిరాశ కలిగించిందన్నారు. ఉద్యమకారుల సమస్యలు, భూముల అంశాలపై ప్రభుత్వం స్పందించకపోతే ప్రజా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జూలై 2న ఉప్పల్ భగాయత్‌లో భారీ భూపోరాటం నిర్వహించనున్నట్లు ప్రకటించారు. తెలంగాణ ప్రజలందరికీ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

## జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సత్తా చాటిన నల్లా కాన్షి రామ్



- **ఆల్ ఇండియా స్థాయిలో 5,407వ ర్యాంకు సాధించి ఐఐటీ ప్రవేశానికి అర్హత**

**హైదరాబాద్, జూన్ 02(తెలంగాణ ముచ్చట్లు):** దేశంలోని అత్యున్నత సాంకేతిక విద్యాసంస్థలైన భారతీయ సాంకేతిక విద్యాసంస్థలు (ఐఐటీ) లో ప్రవేశాల కోసం నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో నాచారం(హైదరాబాద్)కు చెందిన నల్లా కాన్షి రామ్ విశేష ప్రతిభ కనబరిచాడు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు పోటీపడిన ఈ ప్రతిష్టాత్మక పరీక్షలో 5,407వ అఖిల భారత ర్యాంకు సాధించి తన ప్రతిభను నిరూపించాడు.ఐఐటీల్లో ప్రవేశాలకు నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షకు దేశవ్యాప్తంగా సుమారు 1.90 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. అత్యంత పోటీ వాతావరణంలో జరిగిన ఈ పరీక్షలో నల్లా కాన్షి రామ్ ఉత్తమ ర్యాంకు సాధించడం కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, గ్రామస్థుల్లో ఆనందాన్ని నింపింది. అంతకుముందు నిర్వహించిన జేఈఈ మెయిన్స్ పరీక్షకు దేశవ్యాప్తంగా సుమారు 13 లక్షల మంది విద్యార్థులు హాజరుకాగా, అందులో కాన్షి రామ్ 92 శాతం శ్రేణి సాధించి జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత పొందాడు. అనంతరం కఠోర శ్రమ, పట్టుదల, లక్ష్యసాధనతో ముందుకు సాగి జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అద్భుత ఫలితాన్ని సాధించాడు.ఈ సందర్భంగా తన విజయానికి సహకరించిన కళాశాల అధ్యాపకులు, శిక్షణ సంస్థ ఉపాధ్యాయులు, అలాగే తల్లిదండ్రులు నల్లా రాధాకృష్ణ, చీరాల అన్నపూర్ణలకు కాన్షి రామ్ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో ఐఐటీలో ఉన్నత విద్యను అభ్యసించి ప్రతిభావంతమైన ఇంజినీర్‌గా ఎదిగి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలన్నదే తన లక్ష్యమని పేర్కొన్నారు.నల్లా కాన్షి రామ్ సాధించిన విజయంపై స్థానిక ప్రజలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు.నాచారంకు చెందిన విద్యార్థి జాతీయ స్థాయిలో ప్రతిభ చాటడం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

## తెలంగాణ తెచ్చింది ఆర్ట్స్ కళాశాలే.. తెలంగాణ భవన్ కాదు



- **ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి**
- **మూడు తరాల పోరాటానికి ఆర్ట్స్ కళాశాల వేదిక**
- **ఆర్ట్స్ కళాశాలకు పుష్పాభిషేకం**

**హైదరాబాద్, జూన్ 02(తెలంగాణ ముచ్చట్లు):** ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించింది ఆర్ట్స్ కళాశాలేనని, తెలంగాణ భవన్ కాదని ఎస్సీ సంస్థ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి 12 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆవరణలోని ఆర్ట్స్ కళాశాల వద్ద నిర్వహించిన పుష్పాభిషేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

భారత విద్యార్థి సమాఖ్య ఉస్మానియా విశ్వవిద్యాలయ అధ్యక్షుడు కల్వకుర్తి శ్రీశైలం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాలకు పుష్పాభిషేకం చేసిన అనంతరం డాక్టర్ పిడమర్తి రవి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించింది ఏ ఒక్క నాయకుడు కాదని, విద్యార్థుల త్యాగాలు, ఉద్యమాలేనని పేర్కొన్నారు. మూడు తరాలుగా సాగిన తెలంగాణ ఉద్యమానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం, ముఖ్యంగా ఆర్ట్స్ కళాశాల ప్రధాన వేదికగా నిలిచిందన్నారు. ఎలాంటి స్వార్థం లేకుండా వేలాది మంది విద్యార్థులు నిస్వార్థంగా ఉద్యమంలో పాల్గొని ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పోరాడారని చెప్పారు. వారి త్యాగాలు, పోరాటాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందన్నారు. నేడు ప్రజలు స్వరాష్ట్రంలో జీవిస్తున్నారంటే అందుకు ఉద్యమ విద్యార్థులే కారణమని పేర్కొన్నారు.

తెలంగాణలో ఏ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకున్నా ముందుగా ప్రశ్నించే చరిత్ర ఆర్ట్స్ కళాశాలకు ఉందన్నారు. ఉద్యమాల గడ్డగా పేరుగాంచిన ఈ కళాశాల నుంచి భవిష్యత్తులో మరింత మంది నాయకులు, సామాజిక కార్యకర్తలు ఎదిగి తెలంగాణ సమాజానికి నాయకత్వం వహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో భారత విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు బోరెల్లి సురేష్, ఉస్మానియా విశ్వవిద్యాలయ సంయుక్త కార్యాచరణ సమితి నాయకుడు మహ్మద్ రహీం, భారత విద్యార్థి సమాఖ్య గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మొగిలిగిద్ద ప్రసాద్, విద్యార్థి నాయకులు ఆరెకంటి శ్రీకాంత్, మీసాల మహేష్, నక్క రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కుశలమా.. పెద్దల కుశలాన్ని అడిగిన మానవత్వపు ఖాకీ!

**భీమదేవరపల్లి,జూన్2(తెలంగాణ ముచ్చట్లు)**



కుశలమా" అనే పేరు పెట్టిన కార్యక్రమం నిజంగానే పెద్దల కుశలాన్ని, వారి మనసుల ఆనందాన్ని అడిగిన అరుదైన ప్రయత్నంగా నిలిచిపోయింది. వంగరలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరోగ్య శిబిరంలో వైద్య శాఖ తరపున మా సేవలు అందించే అవకాశం రావడం మా అదృష్టంగా భావిస్తున్నాము. సాధారణంగా పోలీస్ అంటే క్రమశిక్షణ, చట్ట పరిరక్షణ గుర్తుకు వస్తాయి. కానీ ఈ రోజు మేము చూసింది మాత్రం మరో రూపం... మానవత్వం అనే యూనిఫాం ధరించిన పోలీసులను. ఏ.సి.పి ప్రశాంత్ రెడ్డి , ఎల్కతుర్తి సి.ఐ పులి రమేష్ , ఎల్కతుర్తి సబ్ ఇన్స్పెక్టర్ నరసింహారావు , ముల్కనూర్ సబ్ ఇన్స్పెక్టర్ రాజు వంగర సబ్ ఇన్స్పెక్టర్ దివ్య మరియు వారి బృందం తమ విధులను మరిచి, ఆ పెద్దలకు ఇంటి కొడుకుల్లా, మనవళ్లలా అండగా నిలిచారు. ఆరోగ్య పరీక్షల కోసం వచ్చిన వృద్ధులు ఎండలో ఇబ్బంది పడకుండా "బలగం" సినిమా ప్రదర్శించి వారి ముఖాల్లో చిరునవ్వులు పూయించారు. పరీక్షలు పూర్తయ్యాక భోజనాలు కేవలం ఏర్పాటు చేయలేదు... అందరినీ ఒకచోట ప్రేమగా కూర్చోబెట్టి, స్వయంగా వారి వద్దకే వెళ్లి ఆప్యాయంగా వడ్డించారు. నడవలేని స్థితిలో ఉన్నవారి వద్దకే వెళ్లి ఆహారం, మంచినీళ్లు అందించారు. ఆ దృశ్యం చూస్తుంటే పోలీసులుగా కాదు, సొంత కుటుంబ సభ్యులుగా సేవ చేస్తున్నట్లు అనిపించింది. ముల్కనూర్ సబ్ ఇన్స్పెక్టర్ రాజు నడవడానికి ఇబ్బంది పడుతున్న వృద్ధులను స్వయంగా చేత పట్టుకుని, అవసరమైతే ఎత్తుకుని తీసుకురావడం చూసినప్పుడు "సేవ" అనే పదానికి నిజమైన అర్థం తెలిసింది. నీళ్ల దగ్గర నుంచి స్టీల్ ప్లేట్ల వరకు ప్రతి చిన్న విషయాన్ని ఎంతో శ్రద్ధగా చూసుకున్నారు. వందల మందికి పేపర్ ప్లేట్లు కాకుండా స్టీల్ ప్లేట్లు ఉపయోగించడం ద్వారా పర్యావరణ పరిరక్షణ పట్ల తమ బాధ్యతను కూడా చాటిచెప్పారు. "ప్లాస్టిక్ రహిత భూమి" అనే సందేశాన్ని మాటలతో కాదు, చేతలతో అందించారు. వెళ్లే సమయంలో మహిళలకు చీరలు, పురుషులకు పంచెలు, గొడుగులు బహుమతిగా అందించి వారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. జీవితంలో ఎన్నో పోలీసులను చూసి ఉంటారు ఆ పెద్దలు... కానీ ఇంత ప్రేమతో, ఇంత ఆప్యాయతతో దగ్గరైన పోలీసులను మాత్రం బహుశా ఎప్పుడూ చూసి ఉండరు. "ఏ సమస్య వచ్చినా మా దగ్గరకు రండి" అని ఇచ్చిన భరోసా వారికి కేవలం మాట కాదు... ఒక ధైర్యం, ఒక నమ్మకం.

ఈ అద్భుత కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ఏ.సి.పి ప్రశాంత్ రెడ్డి ప్రత్యేక అభినందనలు. సార్, మీకు కేవలం అభిమానులేలేరు... మిమ్మల్ని చూసి స్ఫూర్తి పొందే మనుషులు ఉన్నారు. మీ సేవా దృక్పథం, మీ సౌమ్యత, మీ నాయకత్వం అనేక మందికి ఆదర్శం.

ఈ రోజు మేము ఒక ఆరోగ్య శిబిరంలో పాల్గొనలేదు... మానవత్వం ఎలా ఉండాలో నేర్పిన ఒక పాఠాన్ని చూసాము. ఖాకీకి కఠినత్వం అలంకారం అనుకుంటాం... కానీ ఈ రోజు ఖాకీకి కరుణ కూడా అలంకారమే అని మీరు నిరూపించారు.మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేసారు

# ఎల్కతుర్తిలో తెలంగాణ ఆత్మగౌరవాన్ని చాటిన ఆవిర్భావ వేడుకలు



**ఎల్కతుర్తి, జూన్ 2 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఎల్కతుర్తి మండలంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. వివిధ రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరణలు, అమరవీరులకు నివాళులు, తెలంగాణ సాధనలో పోరాడిన నాయకుల సేవలను స్మరించుకుంటూ కార్యక్రమాలు చేపట్టారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడు పిట్టల మహేందర్ నాయకత్వంలో మండలంలోని పలు గ్రామాల్లో జాతీయ జెండాతో పాటు పార్టీ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం ఎల్కతుర్తి బస్టాండ్ కూడలిలో జరిగిన కార్యక్రమంలో పిట్టల మహేందర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన అలుపెరగని పోరాటాన్ని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమంలో అమరులైన వీరుల త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. అదే విధంగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఎల్కతుర్తి కూడలిలో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ జాతీయ జెండాను ఆవిష్కరించి తెలంగాణ సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు నివాళులర్పించారు. రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ రాష్ట్ర సాధన వెనుక ఉన్న పోరాట స్ఫూర్తిని స్మరించుకున్నారు. రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షిస్తూ ప్రజలకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# ఆగిన రోడ్లే కాంగ్రెస్ పాలనకు నిదర్శనం

- **దమ్మపేటలో పెండింగ్ పనుల పరిశీలనలో మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు.**




**దమ్మపేట, జూన్ 2 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి పనులు స్తంభించిపోయాయని అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మెచ్చా నాగేశ్వరరావు విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం దమ్మపేట మండలంలోని అసంపూర్తిగా ఉన్న రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వేగంగా సాగిన అభివృద్ధి పనులు ప్రస్తుతం నిలిచిపోయాయని, గత ప్రభుత్వం మంజూరు చేసి ప్రారంభించిన పనులను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేయలేకపోతోందని ఆరోపించారు. కొత్త పనులు తీసుకురావడంలో విఫలమైన ప్రభుత్వం, ఇప్పటికే ప్రారంభమైన అభివృద్ధి కార్యక్రమాలను సైతం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో అభివృద్ధి గురించి గొప్పలు చెప్పుకునే ముందు, అసంపూర్తిగా ఉన్న పనులపై కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దమ్మపేట మండలంలో నిలిచిపోయిన రోడ్డు పనులే ప్రస్తుత ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతున్నాయని పేర్కొన్నారు. పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని, లేకపోతే ప్రజల తరపున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అసంపూర్తిగా ఉన్న రోడ్లు మల్లారం రోడ్డు నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. గాంధీనగర్-మందలపల్లి రహదారి పనులు స్తంభించడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మందలపల్లి సబ్‌స్టేషన్‌కు వెళ్లే రహదారి పనులు పూర్తి కాలేదు. జలవాగు రోడ్డు నిర్మాణం ముందుకు సాగడం లేదు. పెద్దగొల్లగూడెం-మల్కారం రహదారిలో లంక ప్రాంతం వద్ద పనులు నిలిచిపోయాయి. గుత్తావారిగూడెం-గంగులగూడెం రహదారి దుస్థితికి చేరుకుందని ఆయన తెలిపారు.

# జమ్మికుంటలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం.. అమరవీరులకు నివాళులు

**జమ్మికుంట టౌన్ జూన్ 02 (తెలంగాణ ముచ్చట్లు):**




తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జమ్మికుంట మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ చైర్మన్ శ్రీ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి, మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

గాంధీ చౌరస్తాలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకుంటూ నివాళులర్పించారు. ప్రజాకవి గద్దర్ చిత్రపటానికి కూడా పూలమాల వేసి గౌరవం తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎన్నో మంది విద్యార్థులు, యువకులు, ఉద్యమకారులు చేసిన త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. తాను కూడా విద్యార్థి నాయకుడిగా తెలంగాణ ఉద్యమంలో పాల్గొని అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నానని, నేడు ప్రజల ఆశీర్వాదంతో మున్సిపల్ చైర్మన్‌గా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొనడం గర్వకారణంగా భావిస్తున్నానని పేర్కొన్నారు.

తెలంగాణ కోసం అమరులైన వీరులను స్మరించుకుంటూ "వీరులారా వందనం" గేయాన్ని ఆలపించి వారికి ఘన నివాళులర్పించారు. అలాగే జమ్మికుంట పట్టణ ప్రజలకు, తెలంగాణ ప్రజలందరికీ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, మేనేజర్ జి. రాజిరెడ్డి, కౌన్సిలర్లు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, తెలంగాణ ఉద్యమకారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థినికి బాసర ఐఐటీలో సీటు



**హుజూరాబాద్, జూన్ 2(తెలంగాణ ముచ్చట్లు):** ప్రభుత్వ పాఠశాలల్లోనూ నాణ్యమైన విద్య అందుతుందని, పట్టుదలతో చదివితే ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని హుజూరాబాద్ మండలం ఇప్పల్ నర్సింగాపూర్ గ్రామానికి చెందిన విద్యార్థిని కళ్లెపు అభినయశ్రీ నిరూపించింది. ఇప్పల్ నర్సింగాపూర్ ఉన్నత ప్రాథమిక పాఠశాల (యూపీఎస్)లో ప్రాథమిక విద్య అభ్యసించిన అభినయశ్రీ ఇటీవల విడుదలైన బాసర ఐఐటీ ప్రవేశ ఫలితాల్లో సీటు సాధించి గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. క్రాంతి కుమార్ కుమార్తె అయిన అభినయశ్రీ చిన్ననాటి నుంచే చదువులో ప్రతిభ కనబరుస్తూ ఉపాధ్యాయుల ప్రశంసలు అందుకుంది. గ్రామీణ ప్రాంతానికి చెందిన ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించినప్పటికీ ఆమె తన ప్రతిభతో పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించింది. అనంతరం జరిగిన ప్రవేశ ప్రక్రియలో ప్రతిష్టాత్మక బాసర ఐఐటీలో సీటు కైవసం చేసుకుని తన లక్ష్య సాధనలో మరో ముందడుగు వేసింది. అభినయశ్రీ సాధించిన విజయంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. తమ కుమార్తె ఉన్నత విద్యా సంస్థలో ప్రవేశం పొందడం పట్ల తండ్రి క్రాంతి కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇప్పల్ నర్సింగాపూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం అభినయశ్రీని, ఆమె తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. శాలువా కప్పి అభినందనలు తెలియజేసి మిఠాయిలు పంచిపెట్టారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో అపారమైన ప్రతిభ ఉందని, క్రమశిక్షణతో పాటు నిరంతర శ్రమ ఉంటే ఎలాంటి లక్ష్యాన్నైనా సాధించవచ్చని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. అభినయశ్రీ విజయం తోటి విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ ప్రముఖులు, విద్యార్థులు పాల్గొని అభినయశ్రీకి శుభాకాంక్షలు తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహణ



**భీమదేవరపల్లి, జూన్ 2 (తెలంగాణ ముచ్చట్లు):** ముల్కనూరు అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన అమరవీరులు, ఉద్యమ కారుల త్యాగాలను స్మరించుకుంటూ వారి సేవలను కొనియాడారు. తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తూ రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో డ్యాగల సారయ్య, జాలి ప్రమోద్ రెడ్డి, ఆదరి రవి, ఎదులాపురం తిరుపతి, శనిగరం సది, చిట్కూరి అనిల్, లక్ష్మారెడ్డి, గద్వాల ప్రశాంత్, చెప్యాల ప్రకాష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఆవిర్భావ స్ఫూర్తితో ఘనంగా వేడుకలు



**బడిబాట కార్యక్రమానికి విశేష స్పందన**

**పెద్దమందడి,జూన్03( తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మద్దిగట్ల మోజర్ల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆవిర్భావానికి పునాదులు వేసిన ఆచార్య జయశంకర్‌తో పాటు తెలంగాణ సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన అమర విద్యార్థులకు ఘనంగా నివాళులు అర్పించారు.కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఎస్. వరప్రసాద్‌రావు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం విద్యార్థులు, ఉద్యోగులు ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొంటూ పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహించారని తెలిపారు. ముఖ్యంగా యూనివర్సిటీ విద్యార్థులు చేసిన త్యాగాలు రాష్ట్ర ఆవిర్భావంలో కీలక పాత్ర పోషించాయని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర విద్యార్థులు విద్య, క్రీడలు, సాంకేతికత తదితర అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని ఆకాంక్షించారు.అనంతరం నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించి వారి సర్వతోముఖాభివృద్ధికి తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి. వెంకటస్వామి, గద్వాల కృష్ణయ్య, శ్రీమతి వాణిప్రభ, కె. మధుసూదన్, ఎన్. వెంకటస్వామి, ఏ. వెంకటస్వామి, చిన్నారెడ్డి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా జరిగింది.

## గౌడసంగం ఆధ్వర్యంలో ఘనంగా రేణుక ఎల్లమ్మ తల్లి పండగ



**వేలేరు, జూన్ 2 (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి బోనాల పండుగ అత్యంత వైభవంగా నిర్వహించడం జరిగింది, ఈ పండుగ వేడుకలకు గౌడ సంఘం ఆహ్వానం మేరకు బిల్లా యాదగిరి ,వేలేరు మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు మరియు సర్పంచ్ వేలేర్ మేజర్ గ్రామపంచాయతీ ఆలయానికి విచ్చేసి ఎల్లమ్మ తల్లిని దర్శించుకుని వేలేరు గ్రామం, మండలంలోని ప్రజలందరూ సుఖ, సంతోషాలతో ఉండాలని, పంటలు బాగా పండాలని అమ్మవారిని కోరుకోవడం జరిగింది, అమ్మవారి కృప కటాక్షం ప్రజల అందరిపై ఉండాలని, అదేవిధంగా అమ్మవారి ఆలయం చుట్టూ సీసీ రోడ్డు పోయిస్తానని, ఆలయ అభివృద్ధిని చేస్తానని సర్పంచ్ హామీ ఇవ్వడం జరిగింది, అనంతరం సర్పంచ్ ని గౌడ సంఘం కమిటీ వారు సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వేలేర్ మేజర్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ శ్రీకర్ , గౌడ సంఘం అధ్యక్షులు వీరయ్య, ఉపాధ్యక్షులు సార సుమన్, గౌడ సంఘం నాయకులు, వెంకటేశ్ ,చిరంజీవి, రాజు, కనకయ్య, ప్రసాద్, రమేష్, గ్రామ పెద్దలు పురుషోత్తం, వార్డు సభ్యులు సునీల్ పాల్గొన్నారు

# తెలంగాణ ఉద్యమాన్ని మలుపుతిప్పిన చారిత్రాత్మక నిర్ణయం.. రాజన్న రాజీనామా

**స్టేషన్ ఘనపూర్, జూన్02(తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ మలిదశ ఉద్యమ చరిత్రను తిరగేస్తే కొన్ని సంఘటనలు ఉద్యమానికి దిశానిర్దేశం చేసిన మలుపులుగా కనిపిస్తాయి. అలాంటి చారిత్రాత్మక ఘట్టాల్లో స్టేషన్ ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య చేసిన రాజీనామా ఒకటి. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అధికార పార్టీ ఎమ్మెల్యేగా తన పదవికి రాజీనామా చేసి ఉద్యమానికి కొత్త ఊపును తీసుకువచ్చిన నాయకుడిగా రాజయ్య చరిత్రలో నిలిచిపోయారు. అప్పట్లో తెలంగాణ ఉద్యమం ఉద్ధృతంగా కొనసాగుతున్నప్పటికీ, అధికార పార్టీలో కొనసాగుతున్న ప్రజాప్రతినిధులు రాజీనామాల విషయంలో స్పష్టమైన నిర్ణయం తీసుకోని పరిస్థితి నెలకొంది. అలాంటి సమయంలో డాక్టర్ తాటికొండ రాజయ్య తెలంగాణ ఆకాంక్షను పదవి కంటే గొప్పదిగా భావించి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడం ఉద్యమ శ్రేణుల్లో సంచలనంగా మారింది. తెలంగాణ కోసం అధికార కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన తొలి ప్రజాప్రతినిధిగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారు. రాజయ్య రాజీనామా కేవలం ఒక రాజకీయ చర్యగా మాత్రమే కాకుండా, తెలంగాణ






రాష్ట్ర సాధన కోసం జరుగుతున్న పోరాటానికి నైతిక బలాన్ని ఇచ్చిన సంఘటనగా నిలిచింది. ఉద్యమంలో పాల్గొంటున్న విద్యార్థులు, యువత, ఉద్యోగులు, ప్రజాసంఘాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. తెలంగాణ కోసం ప్రజాప్రతినిధులు కూడా తమ పదవులను త్యాగం చేయడానికి సిద్ధంగా ఉన్నారనే సందేశం ప్రజల్లోకి బలంగా వెళ్లింది. రాజన్న వేసిన బాటలోనే తర్వాత పలువురు ప్రజాప్రతినిధులు రాజీనామాల దిశగా అడుగులు వేశారు. దీంతో ఉద్యమం మరింత బలపడటమే కాకుండా తెలంగాణ రాష్ట్ర డిమాండ్ జాతీయ స్థాయిలో మరింత చర్చనీయాంశంగా మారింది. రాజయ్య తీసుకున్న నిర్ణయం ఉద్యమ వ్యూహంలో కీలక మలుపుగా మారి తెలంగాణ సాధన దిశగా ఒత్తిడిని పెంచింది. తెలంగాణ ఉద్యమ చరిత్రలో అనేక మంది నాయకులు తమదైన పాత్ర పోషించినప్పటికీ, పదవిని పణంగా పెట్టి ఉద్యమానికి అండగా నిలిచిన నాయకుల్లో డాక్టర్ తాటికొండ రాజయ్య పేరు ముందు వరుసలో నిలుస్తుంది. ఆయన రాజీనామా తెలంగాణ కోసం జరిగిన త్యాగాల చరిత్రలో ఒక స్ఫూర్తిదాయక అధ్యాయంగా నిలిచిపోయింది. నేడు తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి సంవత్సరాలు గడుస్తున్నా, మలిదశ ఉద్యమాన్ని గుర్తు చేసుకున్న ప్రతిసారి రాజన్న రాజీనామా ప్రత్యేకంగా ప్రస్తావనకు వస్తుంది. తెలంగాణ సాధన కోసం జరిగిన పోరాటంలో ఆ నిర్ణయం ఒక రాజకీయ సంఘటన మాత్రమే కాదు... తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అంకితమైన త్యాగానికి ప్రతీకగా నిలిచిన చారిత్రాత్మక ఘట్టం.

## సిగ్నల్ కోసం ఎదురుచూపులు.. పని లేక నిరాశలో కార్మికులు




**వేలేరు, జూన్ 2 (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండలం పీచర గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంఎన్ఆర్ఈజీఎస్) పనులు సిగ్నల్ సమస్య కారణంగా తీవ్ర అంతరాయానికి గురవుతున్నాయి. పనులకు హాజరయ్యే కార్మికుల ముఖ గుర్తింపు (ఫేస్ అటెండెన్స్) నమోదు కోసం మొబైల్ నెట్‌వర్క్ అందుబాటులో లేకపోవడంతో కార్మికులు పని ప్రదేశాల వద్ద నిరీక్షిస్తూ ఇబ్బందులు పడుతున్నారు. సిగ్నల్ అందకపోవడంతో హాజరు నమోదు కాక పనులు ప్రారంభించలేకపోతున్నామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజూ పనులకు వచ్చినప్పటికీ సాంకేతిక సమస్యల కారణంగా సమయం వృథా అవుతోందని, దీంతో ఉపాధి అవకాశాలు కూడా దెబ్బతింటున్నాయని వారు తెలిపారు.

గ్రామంలో మొబైల్ నెట్‌వర్క్ సమస్యను పరిష్కరించి, ఉపాధి హామీ పనులు సజావుగా సాగేందుకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

## కవంపల్లి సత్యనారాయణపై అనవసర విమర్శలు మానుకోవాలి సొల్లు బాబు




**హుజూరాబాద్, జూన్ 2(తెలంగాణ ముచ్చట్లు):** మానకొండూరు ఎమ్మెల్యే, షెడ్యూల్డ్ కులాల కమిటీ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణపై అనవసర విమర్శలు చేయడం సరికాదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సొల్లు బాబు అన్నారు. ఈ మేరకు ఆయన ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు.

తిప్పారపు సంపత్ గారిని ఉద్దేశించి మాట్లాడుతూ, డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సమాజానికి లేదా పార్టీకి సంబంధించిన ఏదైనా పొరపాటు చేస్తే దానిని సంబంధిత పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్లాలని, కానీ బహిరంగంగా విమర్శలు చేయడం వల్ల సమాజంలో తప్పు సంకేతాలు వెళ్తాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో రాష్ట్ర స్థాయి నాయకత్వం, మంత్రులు, పార్టీ పెద్దలు ఉన్నారని, సమస్యలు ఉంటే వారి ద్వారా పరిష్కారం కోరాలని సూచించారు.

కవ్వంపల్లి సత్యనారాయణకు హుజూరాబాద్ నియోజకవర్గంతో పాటు జిల్లాలోని అనేక వర్గాల ప్రజల్లో మంచి ఆదరణ, అభిమానులు ఉన్నారని సొల్లు బాబు తెలిపారు. ఎస్సీ, బీసీ, ఇతర వర్గాల ప్రజలు ఆయనకు మద్దతుగా ఉన్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలో కరీంనగర్ జిల్లాలో పార్టీని బలోపేతం చేయడంలో కవ్వంపల్లి కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ కోసం ఆయన ఎన్నో సంవత్సరాలుగా కష్టపడ్డారని, పార్టీ అభివృద్ధి కోసం ఆర్థికంగా, రాజకీయంగా ఎంతో సేవ చేశారని అన్నారు. అలాంటి నాయకుడిపై విమర్శలు చేయడం ద్వారా రాజకీయంగా ఎదగాలని భావించడం సరైన పద్ధతి కాదని అభిప్రాయపడ్డారు.

సమాజంలో మంచి కార్యక్రమాలు నిర్వహించడం, ప్రజా సమస్యలపై స్పందించడం వంటి అంశాల్లో అందరూ కలిసి పనిచేయాలని, అయితే నాయకుల ప్రతిష్టకు భంగం కలిగించే వ్యాఖ్యలు చేస్తే తగిన విధంగా స్పందించాల్సి వస్తుందని హెచ్చరించారు. సమాజ ఐక్యతను కాపాడుకుంటూ ముందుకు సాగాలని సొల్లు బాబు కోరారు.

## తెలంగాణ రాష్ట్ర సాధనలో పోరాడిన ఉద్యమకారులకు ఘన సన్మానం



**పెద్దమందడి,జూన్03(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు.గ్రామ పార్టీ అధ్యక్షుడు మలక్ సురేష్ పార్టీ జెండాను ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మలిదశ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొని విశేష సేవలందించిన ఉద్యమకారులు కాజా హుస్సేన్, సతీష్ శర్మ, మలక్ సురేష్, చిత్తూర్ కృష్ణారెడ్డిలను గ్రామ సర్పంచ్ అశోక్ శాలువాలతో ఘనంగా సన్మానించారు. తెలంగాణ ఉద్యమంలో వారు చేసిన సేవలను కొనియాడుతూ వారి పోరాట స్ఫూర్తి యువతకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ జెడ్పిటిసి రఘుపతి రెడ్డి మాట్లాడుతూ.. దశాబ్దాల పోరాటాలు, వేలాది మంది ఉద్యమకారుల త్యాగాలు, అమరుల బలిదానాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం సాకారమైందని అన్నారు. రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారుల సేవలను గుర్తించి గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం కేవలం ఒక వేడుక మాత్రమే కాకుండా ప్రజల ఆత్మగౌరవం, స్వాభిమానం మరియు ఆకాంక్షల సాధనకు ప్రతీకగా నిలిచే చారిత్రక సందర్భంగా అభివర్ణించారు.అనంతరం ఉద్యమకారులకు శాలువాలు కప్పి సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులు, పాల్గొన్నారు.

## తెలంగాణ స్ఫూర్తిని చాటిన హుజూరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి



**హుజూరాబాద్, జూన్ 2 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని హుజూరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నల్ల నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ అమరవీరులను స్మరించుకుంటూ వారికి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమం ప్రారంభంలో మహాత్మా గాంధీ, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన అమరవీరుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బంది కలిసి "జై తెలంగాణ" నినాదాలు చేస్తూ తెలంగాణ స్ఫూర్తిని చాటారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరవీరుల పాత్ర చిరస్మరణీయమని, వారి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డాక్టర్ నల్ల నారాయణ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రతి ప్రభుత్వ ఉద్యోగి అంకితభావంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రవణ్ కుమార్, ప్రతాప్,వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, పారామెడికల్ సిబ్బంది, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ వేడుకలను విజయవంతం చేశారు.

# ములకనూరు పశువైద్యశాలలకు రూ.1.40 కోట్ల నిధులు

- మంత్రి పొన్నం ప్రభాకర్ కృషితో నూతన భవనాల నిర్మాణానికి పరిపాలనా అనుమతులు

**భీమదేవరపల్లి, జూన్ 2 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి మరియు మత్స్యశాఖ ఆధ్వర్యంలో హుస్నాబాద్ ఏరియా పశువైద్యశాల, భీమదేవరపల్లి మండలంలోని ములకనూరు పశువైద్యశాలకు నూతన భవనాల నిర్మాణం కోసం రూ.1.40 కోట్ల నిధులను మంజూరు చేస్తూ ప్రభుత్వం పరిపాలనా అనుమతులు జారీ చేసింది.

పశుపోషక రైతులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఆధునిక సౌకర్యాలతో కూడిన నూతన భవనాల నిర్మాణాన్ని ప్రభుత్వం చేపడుతోంది. ఈ మేరకు ప్రభుత్వం జి.ఓ .ఆర్.టి. నెం.36, తేదీ 02062026 ద్వారా అధికారిక ఉత్తర్వులు విడుదల చేసింది.

ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, హుస్నాబాద్ ప్రాంతంలో పశుసంపద అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పశుపోషక రైతులు తమ పశువులకు నాణ్యమైన వైద్య సేవలు పొందేందుకు ఆధునిక సదుపాయాలతో కూడిన భవనాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రజా పాలన ప్రభుత్వం హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో కట్టుబడి ఉందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తామని మంత్రి పేర్కొన్నారు. నిధుల మంజూరుకు సహకరించిన రేవంత్ రెడ్డి మరియు వాకిటి శ్రీహరిలకు మంత్రి పొన్నం ప్రభాకర్ కృతజ్ఞతలు తెలిపారు.




## వేలేరు పోలీస్ స్టేషన్‌లో ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**వేలేరు, జూన్ 2 (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేలేరు ఎస్సై సురేష్ జాతీయ జెండాను ఆవిష్కరించి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన అమరవీరులు, ఉద్యమకారుల త్యాగాలను స్మరించుకుంటూ వారి సేవలను కొనియాడారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొని తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.



## అగ్నిప్రమాద బాధితులకు అండగా ఎమ్మెల్యే రాగమయి

- నగదు, నిత్యావసర వస్తువుల అందజేత.
- ఇందిరమ్మ గృహం మంజూరుకు చర్యలు.

**సత్తుపల్లి, జూన్ 2 (తెలంగాణ ముచ్చట్లు):** స్థానిక పట్టణంలోని వెంగళరావు కాలనీలో అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన కుటుంబానికి ఎమ్మెల్యే మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ అండగా నిలిచారు. మంగళవారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో షేక్ బీబీ, రెహమాన్ దంపతుల ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఇంట్లోని సామగ్రి, గృహోపకరణాలు అగ్నికి ఆహుతయ్యాయి. అయితే ఘటన సమయంలో కుటుంబ సభ్యులు ఇంట్లో లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వారికి బియ్యం, నిత్యావసర సరుకులు, దుప్పట్లు, గిన్నెలు, ప్లేట్లు, కూరగాయలు అందజేయడంతో పాటు రూ.5 వేల నగదు సహాయం చేశారు. అదేవిధంగా తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి బాధితురాలు షేక్ బీబీకి ఇందిరమ్మ గృహం మంజూరు అయ్యేలా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెహనా బేగం, వైస్ చైర్‌పర్సన్ బొంతు సుమలత, మున్సిపల్ కమిషనర్ నరసింహ, కౌన్సిలర్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్, జాతీయ బీసీ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నారావు, సీనియర్ నాయకుడు చల్లగుళ్ల నరసింహారావు, వెంగళరావు కాలనీ కాంగ్రెస్ నాయకులు భాస్కర్, మురళిరెడ్డి, మొరిశెట్టి సాంబశివరావు, తెలంగాణ ఉద్యమకారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హుజూరాబాద్ LIC అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లోకిని రాజయ్యకు ఘన వీడ్కోలు

**హుజూరాబాద్, జూన్ 2 (తెలంగాణ ముచ్చట్లు):**



భారతీయ జీవిత బీమా సంస్థ (LIC) హుజూరాబాద్ శాఖ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా సేవలందిస్తున్న గౌరవనీయులు లోకిని రాజయ్య గారు హైదరాబాద్‌లోని జోనల్ కార్యాలయానికి బదిలీ అయిన సందర్భంగా మంగళవారం హుజూరాబాద్‌లో ఘన వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం హుజూరాబాద్ బ్రాంచ్ లియాఫీ (LIAFI), PST ప్రతినిధులు మరియు LIC ఏజెంట్ మిత్రుల ఆధ్వర్యంలో అత్యంత ఆత్మీయ వాతావరణంలో జరిగింది.

ఈ సందర్భంగా లోకిని రాజయ్య గారిని పూల బొకేలు అందజేసి, శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. హుజూరాబాద్ శాఖలో ఆయన అందించిన సేవలను, ఉద్యోగులతో మరియు ఏజెంట్లతో కలిసిమెలిసి పనిచేసిన తీరును పలువురు వక్తలు కొనియాడారు. తన విధి నిర్వహణలో క్రమశిక్షణ, అంకితభావం, సహృదయతను ప్రదర్శిస్తూ సంస్థ అభివృద్ధికి విశేష కృషి చేశారని పేర్కొన్నారు.

రాజయ్య గారు హుజూరాబాద్ శాఖలో పని చేసిన కాలంలో పాలసీదారులకు మెరుగైన సేవలు అందించడంలో, ఏజెంట్ల సమస్యల పరిష్కారంలో, కార్యాలయ పనితీరును మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించారని అభినందించారు. ఆయన సేవలు శాఖ అభివృద్ధికి ఎంతో దోహదపడ్డాయని పలువురు గుర్తు చేశారు.

అనంతరం మాట్లాడిన లోకిని రాజయ్య గారు హుజూరాబాద్ శాఖలో తనకు అందిన సహకారం, ప్రేమాభిమానాలను ఎప్పటికీ మరువలేనని తెలిపారు. ఉద్యోగులు, ఏజెంట్లు మరియు లియాఫీ నాయకులు అందించిన సహకారంతోనే తన విధులను విజయవంతంగా నిర్వహించగలిగానని పేర్కొన్నారు. తనపై చూపిన అభిమానానికి అందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. హైదరాబాద్ జోనల్ కార్యాలయంలో కొత్త బాధ్యతలను విజయవంతంగా నిర్వహించాలని, మరిన్ని ఉన్నత స్థానాలను అధిరోహించాలని కార్యక్రమానికి హాజరైనవారు ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లియాఫీ నాయకులు, PST ప్రతినిధులు, LIC అధికారులు, సిబ్బంది, ఏజెంట్లు మరియు పలువురు ప్రముఖులు పాల్గొని రాజయ్య గారికి ఘనంగా వీడ్కోలు పలికారు.

# అమరవీరుల స్ఫూర్తితో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**హుజూరాబాద్, జూన్ 2 (తెలంగాణ ముచ్చట్లు ):** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని హుజూరాబాద్ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి రొంటాల సుహాసిని మనోజ్ రావు ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకుంటూ అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.



ఈ సందర్భంగా చైర్‌పర్సన్ సుహాసిని మనోజ్ రావు మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం వేలాది మంది ఉద్యమకారులు చేసిన త్యాగాలు, పోరాటాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. అమరవీరుల త్యాగఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని, వారి ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం విద్య, వైద్యం, సాగునీరు, మౌలిక సదుపాయాలు, పరిశ్రమలు, గ్రామీణాభివృద్ధి వంటి అనేక రంగాల్లో విశేష పురోగతి సాధించిందని తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల సేవలను తరతరాలకు తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆమె అన్నారు. వారి స్ఫూర్తితో సమాజాభివృద్ధికి కృషి చేయడమే వారికి నిజమైన నివాళి అవుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు చేరువయ్యేలా స్థానిక సంస్థలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి. కిషన్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం ప్రజల ఆకాంక్షలకు ప్రతీక అని, రాష్ట్ర అభివృద్ధిలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని అన్నారు. తెలంగాణ ఉద్యమ చరిత్రను యువత తెలుసుకుని అమరవీరుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

అనంతరం అమరవీరుల స్థూపం వద్ద రెండు నిమిషాల మౌనం పాటించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్, వార్డు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ మేనేజర్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో దేశభక్తి, తెలంగాణ ఆత్మగౌరవ భావనలు ప్రతిఫలించేలా వేడుకలు ఉత్సాహంగా సాగాయి.

కార్యక్రమం ముగింపులో తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని, అమరవీరుల ఆశయ సాధన కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ప్రతిజ్ఞ చేశారు. పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు తెలంగాణ రాష్ట్ర ప్రగతికి తమ వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు.

# వేలేరు గ్రామపంచాయతీలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**వేలేరు, జూన్ 2 (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ జెండాను ఆవిష్కరించి గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ బిల్లా యాదగిరి అధ్యక్షత వహించారు.




ఈ సందర్భంగా సర్పంచ్ బిల్లా యాదగిరి మాట్లాడుతూ తెలంగాణ సాధన కోసం అలుపెరగని పోరాటం చేసిన ఉద్యమకారులు, విద్యార్థులు, అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారికి ప్రత్యేక సదుపాయాలు కల్పించే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు. అలాగే ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో వేలేరు మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో అభివృద్ధి నిధులు, సంక్షేమ పథకాలు పెద్ద ఎత్తున మంజూరు చేయించుకున్నామని పేర్కొన్నారు. గ్రామాన్ని జిల్లా స్థాయిలో అభివృద్ధిలో ముందువరుసలో నిలిపేలా తన పరిపాలన ఉంటుందని, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం గ్రామ ప్రజలకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా గ్రామపంచాయతీ సిబ్బందికి డ్రెస్సులు, బ్లౌజులు, చెప్పులు, మాస్కులు, సబ్బులు, నూనె తదితర శానిటేషన్ సామగ్రిని పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీకర్, ఏపీఎం అనిత, ఎంఎస్ అధ్యక్షురాలు రేణుక, జీపీ కార్యదర్శి సంపత్ కుమార్, సీసీ రమాదేవి, పీహెచ్‌సీ డాక్టర్ మేఘన, ఏఈఓ రాజశేఖర్, వివో అధ్యక్షురాలు, సీఏఎస్, వివిధ శాఖల అధికారులు, వార్డు సభ్యులు లక్ష్మీనారాయణ, ప్రవళిక, పర్వీన్, సంధ్య, మౌనిక, సునీల్ తదితరులు పాల్గొన్నారు.


# తెలంగాణ అస్తిత్వాన్ని కించపరిస్తే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారు

**రఘుపతి రెడ్డి మాజీ జెడ్పిటిసి**

**పెద్దమందడి,జూన్03(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు.పార్టీ గ్రామ అధ్యక్షుడు మల్ల సురేష్ కుమార్ పార్టీ జెండాను ఆవిష్కరించి వేడుకలకు శ్రీకారం చుట్టారు. అనంతరం తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను శాలువాలతో సత్కరించి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా మాజీ జడ్పిటిసి రఘుపతి రెడ్డి మాట్లాడుతూ.. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన మహానాడులో తెలంగాణ అనే పదం డిక్షనరీలో లేదు అంటూ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరిచే విధంగా ఉన్నాయని తీవ్రంగా మండిపడ్డారు. తెలంగాణ అస్తిత్వాన్ని ప్రశ్నించే వారిని రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ ఉపేక్షించరని హెచ్చరించారు. దశాబ్దాల పోరాటాలు, వేలాది మంది త్యాగాలు, అమరుల బలిదానాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని గుర్తు చేశారు. తొలి దశ, మలిదశ తెలంగాణ ఉద్యమాల స్ఫూర్తిని కొనసాగిస్తూ అవసరమైతే తెలంగాణ గౌరవాన్ని కాపాడేందుకు మూడో దశ ఉద్యమానికీ ప్రజలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రాణాలకు తెగించి పోరాడారని, ఆయన నాయకత్వంలోనే తెలంగాణ కల సాకారమైందని అన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిన బీఆర్ఎస్‌కు మళ్లీ ప్రజాదరణ పెరుగుతోందని, రాబోయే రోజుల్లో రాష్ట్రంలో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.తెలంగాణ ఆత్మగౌరవం, అస్తిత్వం, స్వాభిమానంపై ఎవరైనా తేలికగా మాట్లాడితే ప్రజలే తగిన సమాధానం చెబుతారని హెచ్చరిస్తూ, రాష్ట్ర ప్రజలందరికీ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పంటను కాపాడుకుందాం.. వరి కొయ్యల దహనానికి స్వస్తి పలుకుదాం



**హుజూరాబాద్, జూన్ 2(తెలంగాణ ముచ్చట్లు ):** రైతులు వరి కొయ్యలను తగలబెట్టకుండా పర్యావరణ పరిరక్షణతో పాటు భూమి సారవంతతను కాపాడాలని హుజూరాబాద్ బీసీ జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. బీసీ జేఏసీ ఆధ్వర్యంలో నాయకులు ఇటీవల వరి కొయ్యలను దహనం చేసిన వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా బీసీ జేఏసీ గౌరవ అధ్యక్షుడు చందుపట్ల జనార్దన్, అధ్యక్షుడు సందేల వెంకన్న మాట్లాడుతూ వరి కొయ్యలను తగలబెట్టడం వల్ల అగ్నిప్రమాదాలు సంభవించి రైతులు కష్టపడి పండించిన ధాన్యం అగ్నికి ఆహుతవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టపోయి రైతులు కన్నీరు పెట్టుకుంటున్న దృశ్యాలు కలచివేస్తున్నాయని పేర్కొన్నారు. వరి కొయ్యల దహనం వల్ల భూమి సారవంతత తగ్గిపోవడంతో పాటు పర్యావరణ కాలుష్యం పెరుగుతుందని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించి, వరి కొయ్యలను భూమిలో కలపడం ద్వారా నేల సారాన్ని పెంచుకోవచ్చని వివరించాలని సూచించారు. ఈ పద్ధతిని అనుసరించడం వల్ల భవిష్యత్తులో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. అలాగే విద్యావంతులైన రైతులు తమ గ్రామాల్లో ఇతర రైతులకు వరి కొయ్యల దహనం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణతో పాటు వ్యవసాయ భూముల ఉత్పాదకతను కాపాడుకోవడం ప్రతి రైతు బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ ప్రధాన కార్యదర్శులు చిలుకమారి శ్రీనివాస్, ఇప్పకాయల సాగర్, నాయకులు మావునూరి ప్రవీణ్ కుమార్, పంజాల వెంకటేశ్వర్లు, నడిగోటి రమేష్, కలకోటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# వాణిజ్య గ్యాస్ ధరల మోత.. సామాన్యులకు మాత్రం ఊరట



దేశవ్యాప్తంగా వాణిజ్య అవసరాల కోసం వినియోగించే ద్రవీభవన పెట్రోలియం వాయువు సిలిండర్ల ధరలను చమురు మార్కెటింగ్ సంస్థలు మరోసారి పెంచాయి. అయితే గృహ వినియోగ సిలిండర్ల ధరల్లో ఎలాంటి మార్పులు చేయకపోవడంతో సాధారణ వినియోగదారులకు కొంత ఉపశమనం లభించింది. కొత్త ధరలు జూన్ ఒకటో తేదీ నుంచి అమల్లోకి వచ్చినట్లు ఆయా సంస్థలు వెల్లడించాయి. తాజా సవరణల ప్రకారం రాజధాని ఢిల్లీలో 19 కిలోల వాణిజ్య సిలిండర్ ధరపై రూ.42 పెంపు జరిగింది. దీంతో ఒక్కో సిలిండర్ ధర రూ.3,113.50కు చేరుకుంది. కోల్‌కతాలో రూ.53.50 పెరగడంతో అక్కడి ధర రూ.3,255.50కు చేరింది. ముంబై, చెన్నై, హైదరాబాద్‌తో పాటు దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లో కూడా ధరలను పెంచారు. అలాగే ఐదు కిలోల స్వేచ్ఛా వాణిజ్య సిలిండర్ ధరను రూ.11 పెంచడంతో ఢిల్లీలో అది రూ.821.50కు చేరింది.

అయితే గృహ వినియోగదారులకు ఉపయోగపడే సబ్సిడీ, సాధారణ వంటగ్యాస్ సిలిండర్ల ధరల్లో ఎలాంటి మార్పులు చేయలేదు. దీంతో కుటుంబాల నెలవారీ ఖర్చులపై అదనపు భారం పడకుండా ప్రభుత్వం, చమురు సంస్థలు జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలుస్తోంది.

మరోవైపు అంతర్జాతీయ విమానయాన రంగానికి ఊరటనిస్తూ విమాన టర్బైన్ ఇంధనం ధరలను సుమారు 2.7 శాతం మేర తగ్గించారు. ఈ తగ్గింపు ప్రధానంగా విదేశీ విమాన సర్వీసులకు వర్తించనుంది. అయితే దేశీయ విమానయాన సంస్థలకు వర్తించే ఇంధన ధరల్లో ఎలాంటి మార్పులు చేయలేదు.

పశ్చిమాసియా ప్రాంతంలో కొనసాగుతున్న భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ ఇంధన సరఫరా వ్యవస్థపై ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో ఇంధన నిల్వలను బలోపేతం చేసేందుకు ఈ ధరల సవరణలు చేపట్టినట్లు మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. ప్రపంచ మార్కెట్‌లో ముడి చమురు ధరల హెచ్చుతగ్గులు, సరఫరా భద్రత వంటి అంశాలు కూడా ఈ నిర్ణయాలపై ప్రభావం చూపినట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు.

వాణిజ్య గ్యాస్ సిలిండర్ల ధరల పెంపు ప్రభావం ముఖ్యంగా హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, క్యాటరింగ్ సంస్థలు మరియు చిన్న ఆహార వ్యాపారాలపై పడే అవకాశం ఉంది. వారి నిర్వహణ వ్యయాలు పెరగడంతో కొన్ని ప్రాంతాల్లో ఆహార పదార్థాల ధరలపై కూడా ప్రభావం కనిపించే అవకాశముందని వ్యాపార వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అయితే గృహ వినియోగ సిలిండర్ల ధరలు యథాతథంగా ఉండటం వల్ల సామాన్య కుటుంబాలకు మాత్రం తక్షణ భారం తప్పిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.




# మార్కెట్లు జోష్‌లో ముగింపు

భారతీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం లాభాలతో ముగిశాయి. సమాచార సాంకేతిక, లోహాలు, వినియోగ వస్తువుల రంగాలకు చెందిన షేర్లలో కొనుగోళ్లు పెరగడంతో ప్రధాన సూచీలు సానుకూలంగా కదిలాయి. అయితే భారత్ అమెరికా మధ్య జరుగుతున్న కీలక వాణిజ్య చర్చల నేపథ్యంలో పెట్టుబడిదారులు జాగ్రత్త ధోరణిని కొనసాగించారు. రోజంతా లాభనష్టాల మధ్య సాగిన ట్రేడింగ్ అనంతరం ముంబై స్టాక్ మార్కెట్ ప్రధాన సూచీ సెన్సెక్స్ 382.50 పాయింట్లు పెరిగి 74,649.84 వద్ద ముగిసింది. జాతీయ స్టాక్ మార్కెట్ సూచీ నిఫ్టీ 100.95 పాయింట్లు లాభపడి 23,483.55 వద్ద స్థిరపడింది. ప్రధానంగా సమాచార సాంకేతిక రంగానికి చెందిన కంపెనీల షేర్లు మార్కెట్‌ను ముందుకు నడిపించాయి. సెన్సెక్స్‌లో సమాచార సాంకేతిక రంగ దిగ్గజాలు, పోర్టు సేవల సంస్థలు, సాంకేతిక సేవల కంపెనీల షేర్లు మంచి లాభాలను నమోదు చేశాయి. మరోవైపు విద్యుత్, బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగాలకు చెందిన కొన్ని షేర్లు ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. అయినప్పటికీ మొత్తం మార్కెట్‌పై సానుకూల ప్రభావం కొనసాగింది.

పెద్ద కంపెనీలతో పాటు మధ్యతరహా, చిన్న తరహా కంపెనీల షేర్లలో కూడా కొనుగోళ్లు కనిపించాయి. మధ్యతరహా కంపెనీల సూచీ స్వల్ప లాభాలతో ముగియగా, చిన్న తరహా కంపెనీల సూచీ మరింత మెరుగైన ప్రదర్శన కనబరిచింది. ఇది మార్కెట్‌లో పెట్టుబడిదారుల విశ్వాసం కొనసాగుతోందనే సంకేతంగా విశ్లేషకులు పేర్కొంటున్నారు.

రంగాల వారీగా పరిశీలిస్తే సమాచార సాంకేతిక రంగం అత్యధిక లాభాలను నమోదు చేసింది. ప్రపంచ మార్కెట్లలో సానుకూల సంకేతాలు, కృత్రిమ మేధ, డిజిటల్ సేవలకు పెరుగుతున్న డిమాండ్ కారణంగా ఈ రంగంలోని షేర్లకు మద్దతు లభించింది. మరోవైపు ఔషధ, ఆరోగ్య సంరక్షణ రంగాల షేర్లు మాత్రం స్వల్ప ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. మార్కెట్ నిపుణుల అభిప్రాయం ప్రకారం, నిఫ్టీ ప్రస్తుతం కీలక నిరోధ స్థాయికి సమీపంలో ఉంది. సమీప భవిష్యత్తులో ఈ స్థాయిని అధిగమిస్తే మరింత ఎగబాకే అవకాశాలు ఉన్నాయని వారు చెబుతున్నారు. అదే సమయంలో దిగువ స్థాయిలు కీలక మద్దతు ప్రాంతాలుగా పనిచేసే అవకాశం ఉందని విశ్లేషిస్తున్నారు.

ఇక దేశీయ మార్కెట్ల దృష్టి ప్రస్తుతం భారత్‌అమెరికా మధ్య జరుగుతున్న ద్వైపాక్షిక వాణిజ్య చర్చలపైనే ఉంది. ఈ చర్చల ఫలితాలు ఎగుమతులు, దిగుమతులు, పెట్టుబడుల ప్రవాహంపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అదనంగా రుతుపవనాల పురోగతి, ద్రవ్యోల్బణ గణాంకాలు, భారతీయ రిజర్వు బ్యాంకు వడ్డీ రేట్ల నిర్ణయాలు, అంతర్జాతీయ ముడి చమురు ధరల కదలికలు రానున్న రోజుల్లో మార్కెట్ దిశను నిర్ణయించే కీలక అంశాలుగా నిలవనున్నాయి.

మొత్తంగా చూస్తే, దేశీయ మార్కెట్లు ప్రస్తుతం సానుకూల ధోరణిని కొనసాగిస్తున్నప్పటికీ అంతర్జాతీయ పరిణామాలు, ఆర్థిక విధానాలపై పెట్టుబడిదారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నట్లు మంగళవారం ట్రేడింగ్ స్పష్టంచేసింది.

# యూపీఐతో పీఎఫ్ డబ్బులు.. ఇక క్షణాల్లోనే ఖాతాలోకి!




ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ సభ్యులకు కేంద్ర ప్రభుత్వం భారీ ఊరట కలిగించే శుభవార్త అందించింది. దేశవ్యాప్తంగా కోట్లాది మంది పీఎఫ్ ఖాతాదారులు ఇకపై తమ భవిష్య నిధి ఖాతాల్లోని అర్హత ఉన్న మొత్తాన్ని యూపీఐ ద్వారా నేరుగా బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ చేసుకునే అవకాశం పొందనున్నారు. ఈ కొత్త వ్యవస్థకు సంబంధించిన సాంకేతిక పరీక్షలు విజయవంతంగా పూర్తయ్యాయని, త్వరలోనే సేవలను ప్రారంభించనున్నట్లు కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్సుఖ్ మాండవియా వెల్లడించారు. ప్రస్తుతం పీఎఫ్ ఖాతా నుంచి నగదు ఉపసంహరించుకోవాలంటే దరఖాస్తు ప్రక్రియ, పరిశీలన, ఆమోదం వంటి దశల కారణంగా పలుమార్లు రోజుల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. ముఖ్యంగా పెద్ద మొత్తాల ఉపసంహరణకు అదనపు ధ్రువీకరణ అవసరమవుతుండటంతో జాప్యాలు ఎదురవుతున్నాయి. కొత్త విధానం అమల్లోకి వచ్చిన తర్వాత ఈ సమస్యలకు ముగింపు పలకాలని అధికారులు భావిస్తున్నారు. పూర్తిగా డిజిటల్ విధానంలో సభ్యులు తమ ఖాతాలోని అర్హత ఉన్న మొత్తాన్ని కేవలం కొన్ని నిమిషాల్లోనే పొందగలుగుతారు. ఈ కొత్త సేవను భవిష్య నిధి సంస్థ మూడో దశ డిజిటల్ సంస్కరణల్లో భాగంగా అమలు చేయనుంది. సభ్యులు తమ మొబైల్‌లో ఉన్న ప్రభుత్వ సేవల వేదిక ద్వారా ఖాతాలో అందుబాటులో ఉన్న అర్హత మొత్తాన్ని పరిశీలించగలరు. అనంతరం యూపీఐ ఆధారిత ధ్రువీకరణ పూర్తి చేసి, ఆ మొత్తాన్ని తమ బ్యాంకు ఖాతాకు తక్షణమే బదిలీ చేసుకోవచ్చు. డబ్బు జమ అయిన వెంటనే యూపీఐ లావాదేవీలు, నగదు ఉపసంహరణలు లేదా ఇతర అవసరాల కోసం వినియోగించుకోవచ్చు. అనారోగ్యం, పిల్లల విద్య, వివాహం, గృహ నిర్మాణం వంటి అత్యవసర అవసరాల కోసం సభ్యులు వెంటనే నిధులు పొందగలగడం ఈ విధానం ప్రధాన ప్రయోజనంగా భావిస్తున్నారు. ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో డబ్బు కోసం రోజుల తరబడి ఎదురు చూడాల్సిన అవసరం లేకపోవడం ఉద్యోగులకు పెద్ద ఉపశమనం కలిగించనుంది. అయితే ఈ సదుపాయాన్ని పొందాలంటే కొన్ని నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. సభ్యుడికి చెల్లుబాటు అయ్యే యూనివర్సల్ అకౌంట్ నంబర్ ఉండాలి. ఆ ఖాతాకు ఆధార్, పాన్ కార్డులు అనుసంధానమై ధ్రువీకరణ పూర్తై ఉండాలి. అలాగే భవిష్య నిధి రికార్డుల్లో ఉన్న పేరు, పుట్టిన తేదీ వంటి వివరాలు ఆధార్‌లోని వివరాలతో పూర్తిగా సరిపోవాలి. వివరాల్లో తేడాలు ఉంటే సేవలు పొందడంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. భవిష్య నిధి ఖాతాలోని మొత్తం సొమ్మును ఒకేసారి ఉపసంహరించుకునే అవకాశం మాత్రం ఉండదు. ఉద్యోగి భవిష్యత్ భద్రతను దృష్టిలో ఉంచుకుని ఖాతాలోని కొంత మొత్తం శాశ్వతంగా భద్రపరుస్తారు. మిగిలిన అర్హత ఉన్న భాగాన్ని మాత్రమే సభ్యులు యూపీఐ ద్వారా పొందగలరు. సభ్యుల సేవలను మరింత సులభతరం చేయడానికి భవిష్య నిధి సంస్థ త్వరలో వాట్సాప్ ఆధారిత సమాచార సేవను కూడా అందుబాటులోకి తీసుకురానుంది. దీని ద్వారా సభ్యులు తమ ఖాతా నిల్వ, ఉపసంహరణ అర్హత, దరఖాస్తుల స్థితి వంటి వివరాలను కేవలం ఒక సందేశంతో తెలుసుకునే అవకాశం కల్పించనున్నారు. ఈ చర్యలతో భవిష్య నిధి వ్యవస్థను పూర్తిగా డిజిటల్, పారదర్శక మరియు వేగవంతమైన సేవా వేదికగా మార్చే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

# వేదాంతపై ఈడీ సోదాలు




దేశీయ గనులు, లోహాలు, చమురు రంగాల్లో అగ్రగామిగా కొనసాగుతున్న వేదాంత గ్రూప్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ గట్టి ఎదురుదెబ్బ ఇచ్చింది. విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం నిబంధనల ఉల్లంఘనకు సంబంధించిన కేసులో వేదాంత గ్రూప్ కార్యాలయాలు, అనుబంధ ప్రాంగణాల్లో ఈడీ అధికారులు విస్తృత స్థాయిలో సోదాలు నిర్వహిస్తున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. సోమవారం ప్రారంభమైన ఈ తనిఖీలు పలు ప్రాంతాల్లో కొనసాగుతున్నాయని సమాచారం. బిలియనీర్ పారిశ్రామికవేత్త అనిల్ అగర్వాల్ నేతృత్వంలోని వేదాంత గ్రూప్‌పై విదేశీ పెట్టుబడులు, విదేశీ మారక లావాదేవీలకు సంబంధించిన అంశాలపై దర్యాప్తు ప్రారంభించిన అనంతరం ఈడీ ఈ చర్యలకు దిగినట్లు తెలుస్తోంది. విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టంలోని కొన్ని కీలక నిబంధనలను సంస్థ ఉల్లంఘించి ఉండవచ్చనే అనుమానాల ఆధారంగా అధికారులు పలు పత్రాలు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వివరాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. అయితే ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను ఈడీ ఇప్పటివరకు బహిరంగపరచలేదు. ఏ అంశాలపై దర్యాప్తు సాగుతోంది, ఎలాంటి లావాదేవీలు అనుమానాస్పదంగా గుర్తించబడ్డాయనే విషయాలపై అధికారిక ప్రకటన వెలువడలేదు. మరోవైపు వేదాంత గ్రూప్ కూడా ఈ సోదాలపై ఇప్పటివరకు ఎటువంటి స్పందన ఇవ్వలేదు. దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న వేదాంత గ్రూప్ గనులు, లోహాలు, అల్యూమినియం, రాగి, జింక్, చమురు, సహజవాయువు వంటి రంగాల్లో విస్తృత వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తోంది. వేలాది మంది ఉద్యోగులకు ఉపాధి కల్పిస్తున్న ఈ సంస్థపై కేంద్ర దర్యాప్తు సంస్థ చర్యలు ప్రారంభించడం వ్యాపార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ పరిణామాల నేపథ్యంలో దేశీయ షేర్ మార్కెట్ వర్గాలు, పెట్టుబడిదారులు, అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు కూడా పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నాయి. దర్యాప్తు ఫలితాలు వెలువడిన తర్వాతే ఈ వ్యవహారం ఎంత మేరకు ప్రభావం చూపుతుందనే అంశంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం ఈడీ సేకరిస్తున్న ఆధారాలు, పత్రాల పరిశీలన పూర్తయ్యాక తదుపరి చర్యలు ఉండనున్నట్లు తెలుస్తోంది.

# అమెరికా పారిశ్రామిక రంగానికి ట్రంప్ ఊతం

అమెరికా జాతీయ భద్రతను మరింత బలోపేతం చేయడంతో పాటు దేశీయ పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. వ్యవసాయం, గృహనిర్మాణం, తయారీ రంగాల్లో స్వయంసమృద్ధిని పెంచేందుకు అవసరమైన వ్యూహాత్మక లోహాల ఉత్పత్తికి ఊతమిచ్చేలా దిగుమతి సుంకాల్లో మార్పులు చేస్తూ కొత్త ప్రకటనపై ఆయన సంతకం చేశారు. ఈ చర్యల ద్వారా అమెరికాలో పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించడం, దేశీయ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం, ఉపాధి అవకాశాలను విస్తరించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు వైట్ హౌస్ వెల్లడించింది. తాజా నిర్ణయం ప్రకారం వ్యవసాయ రంగానికి అవసరమైన కీలక యంత్రాలపై సుంకాలను తగ్గించారు. కంబైన్లు, హార్వెస్టర్లు వంటి వ్యవసాయ పరికరాలపై విధిస్తున్న 25 శాతం సుంకాన్ని



15 శాతానికి కుదించారు. అలాగే ఇప్పటికే 15 శాతం సుంకం పరిధిలో ఉన్న పారిశ్రామిక పరికరాల జాబితాను కూడా విస్తరించారు. ఇకపై వాణిజ్య ఒప్పందాలు కలిగిన దేశాల నుంచి దిగుమతి అయ్యే బుల్డోజర్లు, ఫోర్క్‌లిఫ్ట్‌లు వంటి భారీ యంత్రాలు కూడా అదే సుంకం పరిధిలోకి రానున్నాయి. ఈ మార్పులు 2027 డిసెంబర్ 31 వరకు అమల్లో ఉండనున్నట్లు అధికారులు వెల్లడించారు. అమెరికా తయారీ రంగాన్ని పునరుద్ధరించేందుకు అమలు చేస్తున్న ప్రత్యేక సుంకాల విధానం ఇప్పటికే సానుకూల ఫలితాలు ఇస్తోందని అమెరికా ప్రభుత్వం పేర్కొంది. గత కొన్నేళ్లుగా విదేశీ దిగుమతుల ప్రభావంతో ఒత్తిడిని ఎదుర్కొన్న ఉక్కు పరిశ్రమ మళ్లీ పుంజుకుందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం అమెరికా ప్రపంచంలోనే అతిపెద్ద ఉక్కు ఉత్పత్తి దేశాల్లో ఒకటిగా నిలవడమే కాకుండా, దశాబ్దాల తర్వాత కొత్త ఉక్కు కర్మాగారాల నిర్మాణానికి మార్గం సుగమమైందని వెల్లడించారు. దేశవ్యాప్తంగా పెట్టుబడులు పెరుగుతున్న నేపథ్యంలో వెస్ట్ వర్జీనియా, అర్కాన్సాస్, సౌత్ కరోలినా రాష్ట్రాల్లో భారీ ఉక్కు తయారీ ప్రాజెక్టులు రూపుదిద్దుకుంటున్నాయి. రాబోయే రెండేళ్లలో 40 లక్షల టన్నులకు పైగా అదనపు ఉక్కు ఉత్పత్తి సామర్థ్యం అందుబాటులోకి వచ్చే అవకాశముందని అంచనా వేస్తున్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# రూమర్లపై త్రిష సూటి కౌంటర్?

కోలీవుడ్ స్టార్ నటి త్రిష చేసిన తాజా సామాజిక మాధ్యమ పోస్టు ప్రస్తుతం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గత కొంతకాలంగా ఆమె పేరు ప్రముఖ నటుడు, రాజకీయ నాయకుడు విజయ్ తో ముడిపెడుతూ వస్తున్న పుకార్ల మధ్య త్రిష చేసిన వ్యాఖ్యలు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

తన సామాజిక మాధ్యమ ఖాతాలో ప్రశాంతంగా నిద్రిస్తున్న తన పెంపుడు కుక్క ఫోటోను పంచుకున్న త్రిష, "నా విషయాల్లో ముక్కు పెట్టడానికి నేను అనుమతించే ఒకే ఒక్క ముక్కు ఇదే" అని వ్యాఖ్య రాసింది. ఈ వ్యాఖ్య నేరుగా ఎవరినీ ఉద్దేశించి చేయకపోయినా, తన వ్యక్తిగత జీవితంపై జరుగుతున్న ఊహాగానాలకు పరోక్ష సమాధానంగా భావిస్తున్నారు. ఇటీవల త్రిష, విజయ్ గురించి అనేక రకాల ప్రచారాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. అయితే ఈ ప్రచారాలపై ఇప్పటివరకు ఇద్దరూ బహిరంగంగా స్పందించలేదు. ఇలాంటి సమయంలో త్రిష చేసిన ఈ పోస్టు అభిమానులు, నెటిజన్లలో విస్తృత చర్చకు దారితీసింది. సెలబ్రిటీల వ్యక్తిగత జీవితాలపై అనవసర వ్యాఖ్యలు, ఊహాగానాలు పెరుగుతున్న నేపథ్యంలో త్రిష తనదైన శైలిలో స్పందించిందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. కొందరు ఆమె ధైర్యాన్ని ప్రశంసిస్తుండగా, మరికొందరు ఇది రూమర్లకు ఇచ్చిన గట్టి హెచ్చరికగా పేర్కొంటున్నారు.

ఇటీవల త్రిష చేసే ప్రతి పోస్టు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అవుతుండగా, ఈ తాజా పోస్టు కూడా అదే స్థాయిలో చర్చనీయాంశమైంది. వ్యక్తిగత జీవితానికి గౌరవం ఇవ్వాలనే సందేశాన్ని ఆమె ఈ పోస్టు ద్వారా పరోక్షంగా తెలియజేసిందని సినీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. మొత్తానికి, తన గురించి వస్తున్న ప్రచారాలను పెద్దగా పట్టించుకోకుండా త్రిష తనదైన శైలిలో స్పందించింది. ఈ వ్యాఖ్యల తర్వాత అయినా ఆమె వ్యక్తిగత జీవితంపై జరుగుతున్న ఊహాగానాలకు తెరపడుతుందా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది

# పసుపు రంగు దుస్తుల్లో మెరిసిన తమన్నా..



దక్షిణాది నుంచి బాలీవుడ్ వరకు తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న ప్రముఖ నటి తమన్నా భాటియా మరోసారి తన స్టైలిష్ లుక్‌తో అభిమానులను ఆకట్టుకుంది. ఇటీవల ఓ ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న ఆమె పసుపు రంగు మాక్సీ దుస్తుల్లో కనిపించి అందరి దృష్టిని తనవైపు తిప్పుకుంది. సాధారణతకు, హుందాతనానికి ప్రాధాన్యత ఇస్తూ ఆమె ఎంచుకున్న ఈ దుస్తులు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చనీయాంశమయ్యాయి. లేత పసుపు రంగులో రూపొందిన ఈ దుస్తులు వేసవి కాలానికి అనువుగా ఉండటమే కాకుండా, తమన్నా వ్యక్తిత్వానికి మరింత అందాన్ని చేకూర్చాయి. భుజాలపై సున్నితంగా అమర్చిన పట్టీలు, శరీరాకృతికి సరిపోయే విధంగా రూపొందించిన పైభాగం, కిందికి వెళ్లే కొద్దీ అలల మాదిరిగా కనిపించే పొరలు ఈ దుస్తులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నడుస్తున్న సమయంలో దుస్తులు అందించే సహజమైన కదలిక ఆమె రూపానికి మరింత హుందాతనాన్ని జోడించింది. తన లుక్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చేందుకు తమన్నా సాదాసీదా శైలినే ఎంచుకుంది. అతిగా అలంకరణలకు దూరంగా ఉంటూ, సున్నితమైన మేకప్‌తో సహజమైన అందాన్ని ప్రతిబింబించింది. అలాగే సాధారణ హెయిర్ స్టైల్‌తో తన మొత్తం రూపాన్ని సమతుల్యంగా మలిచింది. ఆమె ధరించిన ఆభరణాలు కూడా అధిక ఆడంబరానికి దూరంగా ఉండి, క్లాసిక్ శైలిని ప్రతిబింబించాయి. నటనతో పాటు వ్యాపార రంగంలోనూ తమన్నా విజయవంతంగా ముందుకు సాగుతోంది. 'తమన్నా ఫైన్ జ్యువెలరీ' పేరుతో ఆమె ప్రారంభించిన ఆభరణాల వ్యాపారం క్రమంగా విస్తరిస్తోంది. ప్రత్యేక డిజైన్లతో రూపొందించిన వజ్రాభరణాలను వివిధ కార్యక్రమాల్లో ధరించడం ద్వారా ఆమె తన బ్రాండ్‌కు మరింత గుర్తింపును తీసుకువస్తోంది. ఒక నటిగా మాత్రమే కాకుండా, మహిళా వ్యాపారవేత్తగా కూడా తన ప్రతిభను చాటుకుంటోంది.



# తాప్సీ అందాల హవా.. సోషల్ మీడియాలో మళ్లీ సందడి

తెలుగు చిత్రసీమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుని, అనంతరం హిందీ చిత్ర పరిశ్రమలో అగ్ర కథానాయికగా ఎదిగిన తాప్సీ పన్ను మరోసారి వార్తల్లో నిలిచింది. అందం, అభినయం, విభిన్న పాత్రల ఎంపికతో ప్రేక్షకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న ఈ నటి ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో తన తాజా చిత్రాలతో ఆకట్టుకుంటోంది.

2010లో విడుదలైన 'ఝుమ్మంది నాదం' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన తాప్సీ తొలి సినిమాతోనే మంచి గుర్తింపు పొందింది. సహజమైన నటన, ఆకర్షణీయమైన వ్యక్తిత్వంతో యువతలో ప్రత్యేక అభిమాన వర్గాన్ని ఏర్పరుచుకుంది. ఆ తర్వాత 'మిస్టర్ పర్‌ఫెక్ట్', 'గుండెల్లో గోదారి', 'సాహసం', 'ఆనందో బ్రహ్మ' వంటి చిత్రాల్లో నటించి తన ప్రతిభను చాటుకుంది.

తెలుగు చిత్రాల్లో వరుస అవకాశాలు వచ్చినప్పటికీ, తాప్సీ తన కెరీర్‌ను మరింత విస్తరించాలనే లక్ష్యంతో హిందీ చిత్రసీమలోకి అడుగుపెట్టింది. అక్కడ కూడా తక్కువ కాలంలోనే తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించింది. వాణిజ్య చిత్రాలతో పాటు కథానాయిక ప్రాధాన్యమున్న చిత్రాలను ఎంపిక చేసుకుంటూ నటిగా తన ప్రత్యేకతను నిరూపించుకుంది.

'పింక్', 'బేబీ', 'ది ఘాజీ అటాక్', 'నామ్ షబానా', 'ముల్క్', 'బద్లా', 'మిషన్ మంగళ్', 'తప్పడ్', 'సాండ్ కీ ఆంఖ్', 'హసీన్ దిల్‌రుబా', 'డుంకీ' వంటి విజయవంతమైన చిత్రాల్లో నటించి విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ముఖ్యంగా మహిళా ప్రధాన కథాంశాలతో రూపొందిన చిత్రాల్లో ఆమె నటనకు విశేష ఆదరణ లభించింది.

ప్రస్తుతం కూడా తాప్సీ చేతిలో పలు భారీ చిత్రాలు ఉన్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఒకవైపు అగ్ర హీరోల సరసన నటిస్తూనే, మరోవైపు మహిళా కేంద్రిత కథలను ప్రోత్సహిస్తూ తన సినీ ప్రయాణాన్ని కొనసాగిస్తోంది. సినిమాలతో పాటు సామాజిక మాధ్యమాల్లోనూ తాప్సీ చురుకుగా ఉంటుంది. షూటింగ్ విరామ సమయంలో విదేశీ పర్యటనలు చేస్తూ, అక్కడి అందమైన ప్రదేశాల్లో దిగిన చిత్రాలు, వీడియోలను అభిమానులతో పంచుకుంటోంది. ఆమె పంచుకునే ప్రతి ఫోటో నెట్టింట వైరల్‌గా మారుతోంది.

ఇటీవల ఆమె పంచుకున్న తాజా చిత్రాలు కూడా అభిమానులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సొగసైన దుస్తుల్లో స్టైలిష్‌గా కనిపించిన తాప్సీ, తన ప్రత్యేకమైన చిరునవ్వుతో మరోసారి అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ చిత్రాలపై అభిమానులు ప్రశంసల వర్షం కురిపిస్తూ, ఆమె అందం రోజురోజుకీ మరింత పెరుగుతోందని వ్యాఖ్యానిస్తున్నారు.

విభిన్న పాత్రలు, బలమైన కథల ఎంపిక, అద్భుతమైన నటనతో భారతీయ చిత్రసీమలో ప్రత్యేక గుర్తింపు పొందిన తాప్సీ పన్ను, భవిష్యత్తులో మరిన్ని విజయాలను సొంతం చేసుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



# తెలంగాణ యాస వచ్చా..? సినిమాల్లో ఛాన్స్ కావాలా..! మేకర్స్ బంపర్ ఆఫర్..!!

ఇటీవల 'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రంతో ప్రేక్షకులను అలరించిన నిర్మాణ సంస్థ ఇప్పుడు మరో అర్థవంతమైన, సందేశాత్మక కథతో ప్రేక్షకుల ముందుకు రానుంది. విలక్షణ దర్శకుడు వేణు వుడుగుల, సంధ్యా భాను చల్లా సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి మధుకర్ రెడ్డి కొమిరెడ్డి కథను అందించడంతో పాటు దర్శకత్వ బాధ్యతలు కూడా నిర్వహిస్తున్నారు. యదార్థ సంఘటనల ఆధారంగా ఈ సినిమా రూపొందనుంది. అన్నదమ్ముల మధ్య విభేదాలు, కుటుంబ కలహాలు అనే సున్నితమైన అంశాన్ని ఈ చిత్రం ప్రధాన కథాంశంగా తీసుకుంది. ఒక కుటుంబం చీలిపోతే కేవలం ఆ ఇంటికే నష్టం జరుగుతుందా, లేక ఆ ప్రభావం మొత్తం గ్రామంపైనే పడుతుందా అనే భావోద్వేగ ప్రశ్న చుట్టూ కథ సాగనుందని చిత్రబృందం వెల్లడించింది. "అన్నదమ్ములు రామలక్ష్మణుల్లా ఉండే రోజులు పోయాయి. ఇప్పుడు రక్తం పంచుకున్న వారే ఒకరిపై ఒకరు నిలబడే పరిస్థితులు కనిపిస్తున్నాయి. జమ్మికుంట మట్టిని సాక్షిగా ఇద్దరు అన్నదమ్ముల మధ్య జరిగిన పంచాయితీ ఒక ఇంటి గడపను మాత్రమే కాదు, మొత్తం ఊరి భవిష్యత్తునే మార్చేసింది. చివరకు గెలిచింది ఎవరో తెలియకపోయినా ఓడిపోయింది మాత్రం ఊరేనని" మేకర్స్ విడుదల చేసిన భావోద్వేగ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ చిత్రం కోసం ప్రస్తుతం నటీనటుల ఎంపిక ప్రక్రియ ప్రారంభమైంది. తెలంగాణ యాసను సహజంగా మాట్లాడగలిగే వారు, నటనపై ఆసక్తి ఉన్న అన్ని వయసుల వ్యక్తులు తమ ఆడిషన్ వీడియోలను పంపవచ్చని చిత్రబృందం తెలిపింది. కొత్త ప్రతిభను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొంది. ఆసక్తి గల అభ్యర్థులు తమ ఆడిషన్ వీడియోలను ఇమెయిల్ లేదా వాట్సాప్ ద్వారా పంపాలని సూచించారు. అయితే సామాజిక మాధ్యమాల్లో చేసే చిన్న వీడియోలను పరిగణనలోకి తీసుకోబోమని, కేవలం సరైన ఆడిషన్ వీడియోలను మాత్రమే పరిశీలిస్తామని మేకర్స్ స్పష్టం చేశారు. 'రాజు వెడ్స్ రాంబాయి' తర్వాత మరోసారి గ్రామీణ నేపథ్యం, బలమైన భావోద్వేగాలు, కుటుంబ సంబంధాల ప్రాధాన్యతను ప్రతిబింబించే కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ చిత్రంపై ఇప్పటికే ఆసక్తి నెలకొంది. తెలంగాణ సంస్కృతి, భాష, గ్రామీణ జీవన విధానాన్ని ప్రతిబింబించే ఈ సినిమా ప్రేక్షకులను ఎంతగా ఆకట్టుకుంటుందో చూడాల్సి ఉంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

పోలీసు అధికారి కాదు... సమాజానికి మార్గదర్శి

భయపెట్టే ఖాకీ కాదు... భరోసా ఇచ్చే ఖాకీ

ఒక చేత్తో చట్టాన్ని కాపాడుతూ... మరో చేత్తో సమాజాన్ని నడిపిస్తూ

యువతకు హెచ్చరిక... వృద్ధులకు ఆప్యాయత

పోలీసింగ్‌కు కొత్త అర్థం చెబుతున్న ఏసీపీ ప్రశాంత్ రెడ్డి

ఖాకీలో కఠినత్వం.. మనసులో కరుణ

# మానవత్వంతో మనసులు గెలుచుకుంటున్న ఏసీపీ పింగిళి ప్రశాంత్ రెడ్డి

**హన్మకొండ,జూన్02(తెలంగాణ ముచ్చట్లు):**

నేటి సమాజంలో పోలీసు అధికారి అంటే చాలామందికి చట్టాన్ని అమలు చేసే అధికారి, నేరాలను అరికట్టే వ్యవస్థ ప్రతినిధి అనే భావన ఉంటుంది. కానీ కొందరు అధికారులు తమ విధులను మించి సమాజం కోసం ఆలోచిస్తారు. ప్రజల సమస్యలను తమ సమస్యలుగా భావిస్తారు. అధికారాన్ని కేవలం హోదాగా కాకుండా బాధ్యతగా చూస్తారు. అలాంటి అరుదైన అధికారుల్లో ఏసీపీ పింగిళి ప్రశాంత్ రెడ్డి ఒకరు.

ఒకవైపు యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు వేదికలపై నిలబడి గంటల తరబడి మాట్లాడే అధికారి... మరోవైపు వృద్ధుల కళ్లలో ఆనందాన్ని చూడటమే తన విజయంగా భావించే మానవతావాది. అందుకే నేడు ఆయన పేరు పోలీసు అధికారిగా మాత్రమే కాదు, సమాజానికి దగ్గరైన వ్యక్తిగా ప్రజల నోట వినిపిస్తోంది.

## యువతను మేల్కొలుపుతున్న ఖాకీ స్వరం

కాలేజీలు, పాఠశాలలు, యువజన సమావేశాల్లో ప్రశాంత్ రెడ్డి చేసే ప్రసంగాలు ప్రస్తుతం తెలంగాణ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. సామాజిక మాధ్యమాల్లో ఆయన వీడియోలు లక్షలాది మందిని చేరుతున్నాయి.

మాదకద్రవ్యాలు, మద్యం, రోడ్డు ప్రమాదాలు, సామాజిక మాధ్యమాల వ్యసనం, తల్లిదండ్రుల కష్టం, జీవిత లక్ష్యాలు... యువత జీవితాన్ని ప్రభావితం చేసే ప్రతి అంశంపై ఆయన మాట్లాడుతున్నారు. అయితే ఆయన మాటల్లో ప్రత్యేకత ఏమిటంటే అవి పుస్తకాల నుంచి వచ్చిన సందేశాలు కావు. పోలీసు అధికారిగా ప్రత్యక్షంగా చూసిన జీవితాల కథలు. "నిన్న మీతో తిరిగినోడు... ఇవ్వాళ ఫోటోలో మాత్రమే మిగిలిపోయాడు" అంటూ ఆయన చెప్పే మాటలు యువతను క్షణం ఆలోచింపచేలా చేస్తున్నాయి. ఒక తప్పు నిర్ణయం జీవితాన్ని ఎలా మార్చేస్తుందో వాస్తవ సంఘటనలతో వివరించడం వల్ల ఆయన సందేశం నేరుగా యువత హృదయాలకు చేరుతోంది.

## వృద్ధుల కోసం "కుశలమా"

యువతతో పాటు వృద్ధుల సంక్షేమం పట్ల కూడా ప్రశాంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. మంగళవారం వంగరలో నిర్వహించిన "కుశలమా" కార్యక్రమం ఇందుకు నిదర్శనంగా నిలిచింది.సీనియర్ పౌరుల కోసం నిర్వహించిన ఈ కార్యక్రమంలో వందలాది మంది వృద్ధులు పాల్గొన్నారు. ఆరోగ్య పరీక్షలు, వైద్య సలహాలు, మందుల పంపిణీతో పాటు వారి మానసిక ఉల్లాసాన్ని పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని విశ్రాంతి ఏర్పాట్లు చేయడంతో పాటు వినోదం కోసం "బలగం" చిత్రాన్ని ప్రదర్శించారు.

## ఆకట్టుకున్న సేవాభావం

కార్యక్రమంలో అత్యంత ప్రత్యేకంగా నిలిచింది పోలీసు సిబ్బంది సేవాభావం. ఏసీపీ ప్రశాంత్ రెడ్డి పర్యవేక్షణలో ఎల్కతుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పులి రమేష్,ఎస్సైలు నరసింహారావు, రాజు, దివ్యతో పాటు సిబ్బంది వృద్ధులకు ప్రత్యేక శ్రద్ధతో సేవలందించారు.భోజనాల సమయంలో వృద్ధుల వద్దకే వెళ్లి ఆహారం వడ్డించడం, నడవలేని వారికి సహాయం చేయడం, తాగునీరు అందించడం వంటి చర్యలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమం ముగింపులో మహిళలకు చీరలు, పురుషులకు పంచెలు, గొడుగులు అందజేశారు.

## ప్రజలకు చేరువైన పోలీసింగ్

ప్రజలతో ప్రత్యక్ష అనుబంధం పెంచుకోవడం, సమస్యలను తెలుసుకోవడం, అవగాహన కార్యక్రమాల ద్వారా సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడం వంటి అంశాల్లో ప్రశాంత్ రెడ్డి ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు."పోలీసింగ్ అంటే భయం కాదు... భరోసా" అనే భావనను ఆచరణలో చూపిస్తూ ప్రజలకు మరింత చేరువవుతున్నారు. యువతకు మార్గనిర్దేశం చేస్తూ, వృద్ధులకు అండగా నిలుస్తూ, సమాజంలో మానవీయ విలువలను ప్రోత్సహిస్తున్న ఆయన సేవలు పలువురికి స్ఫూర్తిగా నిలుస్తున్నాయి.

ఖాకీకి క్రమశిక్షణ ఎంత ముఖ్యమో, మానవత్వం కూడా అంతే ముఖ్యమని తన సేవా కార్యక్రమాల ద్వారా ఏసీపీ పింగిళి ప్రశాంత్ రెడ్డి నిరూపిస్తున్నారు.

## ప్రకృతి,పర్యావరణం పై రైతులకు అవగాహన

యువత, వృద్ధుల సంక్షేమంతో పాటు వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణ అంశాలపైనా ఏసీపీ పింగిళి ప్రశాంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. ఇటీవల పలుచోట్ల రైతులు వరి కోత అనంతరం పొలాల్లో మిగిలిపోయిన కొయ్యకాళ్లను తగులబెడుతుండగా స్వయంగా అక్కడికి వెళ్లి వారితో మాట్లాడారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల భూమిలోని సూక్ష్మ జీవులు నశించడమే కాకుండా నేల సారవంతత క్రమంగా తగ్గిపోతుందని రైతులకు వివరించారు.

వ్యవసాయ భూమి భవిష్యత్ తరాలకు ఆస్తి అని, కొద్దిసేపటి సౌలభ్యం కోసం కొయ్యకాళ్లను కాల్చడం కంటే వాటిని సేంద్రియ ఎరువులుగా మార్చుకోవడం వల్ల భూమికి మేలు జరుగుతుందని అవగాహన కల్పించారు. రైతులు కూడా ఆయన సూచనలను సానుకూలంగా స్వీకరించి పర్యావరణ పరిరక్షణతో పాటు భూసారాన్ని కాపాడే చర్యలకు సహకరించడం విశేషం. పోలీసు అధికారిగా తన విధులతో పాటు సమాజానికి, ప్రకృతికి ఉపయోగపడే అంశాలపై చొరవ చూపడం ప్రశాంత్ రెడ్డి ప్రత్యేకతగా నిలుస్తోంది.

## నిలువెత్తు మానవత్వానికి చిరునామా ఏసీపీ ప్రశాంత్ రెడ్డి

నేటి కాలంలో యువతకు స్ఫూర్తినిచ్చే గురువుగా, వృద్ధులకు భరోసానిచ్చే కొడుకుగా, రైతులకు మిత్రుడిగా, ప్రజలకు అందుబాటులో ఉండే అధికారిగా గుర్తింపు పొందిన పేరు ఏసీపీ పింగిళి ప్రశాంత్ రెడ్డి. మాదకద్రవ్యాల నిర్మూలన నుంచి వృద్ధుల సంక్షేమం వరకు, రైతుల అవగాహన నుంచి సామాజిక బాధ్యత వరకు ప్రతి అంశంలో తనదైన ముద్ర వేస్తున్నారు. విధి నిర్వహణను ఉద్యోగంగా కాకుండా సామాజిక బాధ్యతగా భావిస్తూ, ఖాకీ వెనుక కూడా ఒక సున్నితమైన హృదయం ఉంటుందని నిరూపిస్తున్న ప్రజల అధికారి ఆయన.














Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in